1

నవతెలంగాణ

ఆదిలాబాద్

బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

పీడీఎస్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని కుమురం భీం చౌరస్తాలో మంగళవారం ఉదయం అక్రమంగా తరలిస్తున్న 50 క్వింటాళ్ల పిడిఎస్ బియ్యాన్ని పోలీసులు పట్టుకున్నారు. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల ప్రకారం..తనిఖీల్లో భాగంగా బ్లూకోట్, పెట్రోకార్ విధులు నిర్వహిస్తున్న పోలీసులు మహీంద్రా మినీ డీసీఎంను తనిఖీ చేయగా పిడిఎస్ బియ్యం ఉండటంతో అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ వారిలో కడెం మండలం నర్సింగాపూర్‌కు చెందిన వెంకటేష్, జలపతి ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.



తిరిగి సొంత గూటికి జడ్పీ ఛైర్మెన్

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్ జనార్దన్ రాథోడ్ తిరిగి సొంత గూటికి చేరారు. మంగళవారం ఆదిలాబాద్‌కు వచ్చిన బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు. అప్పటి వరకు ఆయన పార్టీ మారుతారనే విషయం ఎవరికీ తెలియకపోవడం.. అనూహ్యంగా సభావేదికపైకి వచ్చి కేటీఆర్‌ను కలవడంతో అక్కడున్న వారు అందరూ ఆశ్చర్యపోయారు. కాగా బీఆర్ఎస్ తరపున ఆదిలాబాద్ జడ్పీ ఛైర్మెన్‌గా వ్యవహరించిన ఆయన అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన తర్వాత బీజేపీలో చేరారు. ఆ పార్టీ నుంచి ఎంపీ టికెట్ ఆశించారు. కానీ ఆయనకు కమలం టికెట్ దక్కలేదు. మరోపక్క ఆ పార్టీలో సరైన గుర్తింపు లేకపోవడం కారణంగానూ తిరిగి సొంతగూటికి చేరినట్టు తెలిసింది.



సీటు గెలుద్దాం..హామీలపై నిలదీద్దాం..!

- కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం చూపిస్తోంది
- బీజేపీ ఇచ్చిన హామీలను తుంగలో తొక్కింది
- గట్టిగా పట్టుబడితే ఎంపీ సీటు కచ్చితంగా గెలుస్తాం
- కొందరు నేతలు పోయినా..ఉద్యమకారులు మిగిలారు
- ఆదిలాబాద్ గడ్డపై గులాబీ జెండా ఎగురవేద్దాం
- బీఆర్ఎస్ శ్రేణులకు వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు
- 'స్థానిక' ఎన్నికల్లో కార్యకర్తలకు అండగా ఉంటామని భరోసా

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి, ఆదిలాబాద్‌టౌన్

అధికారం ఎవరికీ శాశ్వతం కాదని..ఇది వరకు ప్రభుత్వంలో..పార్టీలో పదవులు అనుభవించిన కొందరు నాయకులు పార్టీని వదిలివెళ్లిపోయినా ఉద్యమకారులు ఇంకా మిగిలే ఉన్నారు. కార్యకర్తల్లో పోరాట పటిమ ఏ మాత్రం తగ్గలేదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు(కేటీఆర్) అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారమే.. ఆదివాసీ బిడ్డ ఆత్రం సక్కుకు పార్టీ ఎంపీ టికెట్ కేటాయించిందని గెలిపించుకునే బాధ్యత మీపై ఉందని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గట్టిగా పట్టుబడితే ఆదిలాబాద్ లోక్‌సభ సీటును కచ్చితంగా గెలుస్తామని ఈ దిశగా కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఆదిలాబాద్ పట్టణ సమీపంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి కేటీఆర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కుతో కార్యకర్తలనుద్దేశించి మాట్లాడారు.

కాంగ్రెస్ అరచేతిలో వైకుంఠం

కాంగ్రెస్ ప్రభుత్వం 120 రోజుల పాలనలో అరచేతిలో వైకుంఠం చూపిస్తోందని, బస్సు ఫ్రీ, బంగారం ఇస్తామని, రైతుభరోసా రూ.15వేలు, రూ.2లక్షల రుణమాఫీ, వరికి రూ.500బోనస్, రూ.4వేల పింఛన్ ఇస్తామని చెప్పి గద్దెనెక్కిన తర్వాత అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. డిసెంబర్‌లోనే రుణమాఫీ చేస్తామని చెప్పి ఐదు నెలలు గడుస్తున్నా ఊసెత్తడం లేదని మండిపడ్డారు. ఆగస్టు 15వరకు పూర్తిచేస్తామని కొత్త కథ చెబుతున్నారని విమర్శించారు. ఇంద్రవెల్లి అమరువీరులకు క్షమాపణ చెప్పకుండా రేవంత్‌రెడ్డి అక్కడికి రావడం సిగ్గుచేటని మండిపడ్డారు. కాంగ్రెస్ హామీలు నిజం కావాలంటే వాటిపై పోరాడే బీఆర్ఎస్‌కు ఓటేయాలని పిలుపునిచ్చారు. మే 13న రైతులు కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలని సూచించారు. గతంలో నీళ్లు పుష్కలంగా ఉండేవని..కాంగ్రెస్ వచ్చిన తర్వాత కరువు వచ్చిందని గుర్తుచేశారు. ఒకప్పుడు జిల్లాలో విష జ్వరాలు ప్రబలేవని..కేసీఆర్ తీసుకొచ్చిన మిషన్ భగీరథ కారణంగా ప్రస్తుతం వాటి జాడలేకుండా పోయాయని గుర్తుచేశారు. బీజేపీ గత ఎన్నికల్లో గెలిపిస్తే సీసీఐని తెరిపిస్తామని హామీనిచ్చిందని.. ఆదిలాబాద్- ఆర్మూర్ రైల్వేలైన్ నిర్మాణం చేపడుతామని చెప్పిందని.. తీరా గెలిచిన తర్వాత వాటిని తుంగలో తొక్కిందని మండిపడ్డారు. ఇలాంటి పార్టీకి ఓటేస్తే ఏలాంటి ఉపయోగం ఉండదని వ్యాఖ్యానించారు.



మాట్లాడుతున్న కేటీఆర్, పక్కన ఎంపీ అభ్యర్థి ఆత్రం సక్కు

ఇంటింటికి వెళ్లి చెప్పండి..!

బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడే ఆదిలాబాద్ జిల్లా అన్నిరంగాల్లో అభివృద్ధి చెందిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఆసిఫాబాద్ జిల్లాకు కుమురంభీం పేరు పెట్టామని, పోడు భూముల పంపిణీ, గూడెలు, తండాలను పంచాయతీలుగా మార్చడం, సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాం. జల్, జంగల్, జమీన్ అనే నినాదాన్ని కేసీఆర్ నిజం చేసి చూపించారని తెలిపారు. వీటితో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టామని ఈ విషయాన్ని కార్యకర్తలు క్షేత్రస్థాయిలో ఇంటింటికి వెళ్లి చెప్పాలని సూచించారు. కాంగ్రెస్ మీద ప్రజలకు ఉన్న భ్రమలు తొలగిపోయాయని తెలిపారు. ఎక్కడ పోగొట్టుకున్నామో అక్కడే రాబట్టుకోవాలని పార్లమెంటు పరిధిలోని 2111 పోలింగ్ బూత్‌లలో కార్యకర్తలు గట్టిగా కృషిచేసి గులాబీ పార్టీని గెలిపించాలని పిలుపునిచ్చారు. ఇది వరకు ప్రభుత్వంలో మంత్రి, వివిధ పదవులు అనుభవించిన నేతలు పార్టీని వదిలివెళ్లిపోయారని.. కానీ ఉద్యమకారులు మాత్రం అలాగే ఉన్నారని వారిలో పోరాట స్ఫూర్తి ఏ మాత్రం తగ్గలేదని గుర్తుచేశారు. తాజా లోక్‌సభ ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలు కష్టపడి గెలిపించాలని.. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో వారికి అండగా ఉంటామని.. కార్యకర్తల కోసం గ్రామాల్లోనూ ప్రచారం చేసేందుకు వస్తానని భరోసా ఇచ్చారు.

కేటీఆర్ రాకతో ఉత్సాహం..!

అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తర్వాత జిల్లాలో డీలా పడిన బీఆర్ఎస్‌కు ఆ పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ రాక ఆ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపింది. మధ్యాహ్నం 12గంటలకు సభా ప్రాంగణానికి చేరుకున్న ఆయన కార్యకర్తలను ఉత్సాహ పరిచేలా జై తెలంగాణ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్‌తో సెల్ఫీలు దిగేందుకు సభా వేదిక వద్దకు కార్యకర్తలు ఒక్కసారిగా గుంపులుగా రావడంతో కొంత గందరగోళ పరిస్థితి ఏర్పడింది. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న జోక్యం చేసుకొని వారికి నచ్చజెప్పారు. ఈ సందర్భంగా జై తెలంగాణ నినాదాలతో సభా ప్రాంగణం మారుమ్రోగింది. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చిన కేటీఆర్ చేసిన ప్రసంగం కార్యకర్తలు, ఆ పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహాన్ని తీసుకొచ్చింది. ఈ సమావేశంలో ఆదిలాబాద్, నిర్మల్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు రాథోడ్ జనార్దన్, విజయలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, నాయకులు లోలం శ్యాంసుందర్, రమాదేవి, చారులత రాథోడ్, జాన్సన్ నాయక్, రంగినేని మనీష, విలాస్, కిరణ్‌కొమ్రెవార్, అలాల అజయ్, యూనిస్ అక్బానీ, సాజిదొద్దిన్, దాసరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు

ఆదివాసీ మహిళకు ఎంపీ టికెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే



నవతెలంగాణ-బేల

స్వాతంత్ర్యం వచ్చిన నాటి నుంచి ఇప్పటివరకు అదిలాబాద్ పార్లమెంటు స్థానంలో తొలిసారి ఆదివాసీ మహిళకు టికెట్ ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి సామ రూపేష్ అన్నారు. మండలంలోని గణేష్‌పూర్ గ్రామపంచాయతీలోని రాయ్‌పూర్‌కేలి గ్రామంలో మంగళవారం ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కాంగ్రెస్ పేదలకు మేలు చేసేలా సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. పార్లమెంటు ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేసి ఆత్రం సుగుణను భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేడం బాపురావు, మాజీ ఉపసర్పంచ్ కటోడ, మడావి భీంరావ్, మడావి కాను, మడావి కన్నుబాయి పాల్గొన్నారు.

బోథ్: కాంగ్రెస్ పార్లమెంట్ అభ్యర్థి ఆత్రం సుగుణను గెలిపించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని సంతలో ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు ప్రతిఒక్కరికీ చేరుతున్నాయని, దీనిపై కార్యకర్తలు ప్రచారం చేయాలని తెలిపారు. నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే పార్లమెంట్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పసుల చంటి, షేక్ నాజర్ అహ్మద్, జి.గంగాధర్, భోజన్న, షేక్ అబుద్, మల్యాల అంజయ్య, రహీమొద్దీన్, సురేందర్, కురుమే గంగయ్య, పడిగల భోజన్న పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి సుగుణ తరపున జడ్పీటీసీ ప్రచారం



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని కోసాయి, దేగాం గ్రామాల్లో జెడ్పిటిసి గోక గణేష్‌రెడ్డి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణ తరపున ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి పదవి చేపట్టిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్‌తో పాటు నాలుగు గ్యారెంటీ పథకాలు అమలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికి దక్కిందన్నారు. బిజెపి, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు అబద్ధాలు చెబుతూ కాలం వెళ్లదీశారన్నారు. బిజెపి దేవుడి పేరుతో కులాలు, మతాలను రెచ్చగొడుతూ విభజిస్తూ పాలిస్తున్నారని తెలిపారు. సోనియా గాంధీ తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన మాట వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా కాంగ్రెస్ హవా వినిపిస్తోందని పేర్కొన్నారు. ఆత్రం సుగుణకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళ్యాణం రాజేశ్వర్, ప్రకాష్‌రావు, మాజీ జెడ్పిటిసి బొల్లారం బాబన్న, పార్టీ నాయకులు వెంకన్న యాదవ్, సోమన్న, మాధవ్, బాబుఖాన్, మాజీ సర్పంచులు విఠల్, రఘు, గంగారాం, ప్రతాప్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు అశోక్, మైనార్టీ సెల్ అధ్యక్షుడు రఫిక్, ప్రవీణ్‌రెడ్డి, సాంబశివ్, ఉత్తం, మోహన్, రాంచందర్, దేవన్న, పోశెట్టి, దాదారావు, పూర్ణచందర్, దత్తు, జయరాం, జైతు పటేల్, మోహన్‌రెడ్డి, రాజు, శ్రీనివాస్, దేవ్‌రావు, గణేష్, సుభాష్ పాల్గొన్నారు.

కేటీఆర్‌కు ఘన స్వాగతం



నవతెలంగాణ-నేరడిగొండ

అదిలాబాద్ పార్లమెంట్ సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు, మాజీ మంత్రి కేటీఆర్‌కు ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఆధ్వర్యంలో రోల్ మామడ టోల్ ప్లాజా వద్ద కార్యకర్తలతో కలిసి గజమాలతో ఘన స్వాగతం పలికారు. జిల్లా కేంద్రంలో సభ అనంతరం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ఇంటి వద్ద విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

డిగ్రీ పున:మూల్యాంకనం ప్రారంభం

నవతెలంగాణ-బేల

ఇటీవల విడుదలైన కాకతీయ యూనివర్సిటీ పరిధిలో రెండు, నాలుగు, ఆరు సెమిస్టర్ డిగ్రీ ఫలితాల్లో ఏమైన సందేహాలున్నా, బాగా రాసినప్పటికీ ఫెయిల్ అయ్యామనే అనుమానం ఉన్న విద్యార్థులు పున:మూల్యాంకనం (రీ వాల్యుయేషన్)కి యూనివర్సిటీ అధికారులు అనుమతి ఇచ్చారు. ఒక సబ్జెక్ట్‌కు రూ.300 మరియు సర్వీసు చార్జి కలిపి ఆన్‌లైన్ సెంటర్‌లో అప్లై చేయవచ్చని, లేదా తమ కాలేజీ పరీక్ష విభాగం కో ఆర్డినేటర్‌లను సంప్రదించవచ్చని కీర్తన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.వరప్రసాద్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ నెల 25వరకు గడువు ఉందని తెలిపారు.

నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలి : కలెక్టర్ రాజర్షి షా

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో రాబోయే రోజుల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాజర్షి షా సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో తాగునీటి అంశాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రానీయకుండా అవసరమైన ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఎండలు రోజురోజుకూ ఎక్కువవుతుండడం వల్ల రాబోయే రోజుల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని, తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. తాగునీటిపై వచ్చే సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని సూచించారు.

మౌలిక వసతుల పనులు వెంటనే ప్రారంభించాలి

అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీపై సమీక్షలో పాఠశాలలో మౌలిక వసతుల కల్పన పనులు కమిటీ తీర్మానంతో జూన్ 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. మౌలిక వసతులు అవసరమైన పాఠశాలల్లో ప్రారంభంకాని పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీటి సౌకర్యం, తరగతి గదుల మేజర్, మైనర్ మరమ్మతులు, టాయిలెట్ మరమ్మతులు, బాలికల కోసం అదనపు టాయిలెట్ల నిర్మాణ పనులు, విద్యుత్ సౌకర్యం, పెయింటింగ్ వంటి మౌలిక వసతుల పర్యవేక్షణ పనులు పాఠశాలలు పున:ప్రారంభమయ్యే లోపు పూర్తి చేయాలన్నారు. పనులు జరిగే పాఠశాల ప్రధానోపాధ్యాయులు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల పనులు అమ్మ ఆదర్శ కమిటీ ద్వారానే పూర్తి చేయాలన్నారు. ఏప పాఠశాలలో ఏప పనులు చేపట్టాలో సంబంధిత అధికారులను మండలాల వారీగా అడిగి తెలుసుకున్నారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలో చేపట్టాల్సిన పనుల గురించి కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. జిల్లా, మండల పరిషత్, ఇంజనీరింగ్ అధికారులు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరులు, మండల విద్యాశాఖాధికారులు క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించాలని ఆదేశించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్, గ్రిడ్, డిటిడబ్ల్యుఓ, డీపీఓ, డిఎల్పీవో, ఎంపిడిఓలు, ఏఈఓ, ఎంపీవో, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



విధుల్లో నిర్లక్ష్యం పట్ల ముగ్గురికి షోకాజ్ నోటీసులు

- అధికారుల తీరుపై పీఓ ఆగ్రహం



నవతెలంగాణ-కెరమెరి

విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన మండలంలోని మోడీ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాలకు చెందిన ముగ్గురికి ఐటిడిఏ పిఓ కుష్బు గుప్త షోకాజ్ నోటీసులు జారీ చేశారు. పీవో మంగళవారం మోడీ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. రికార్డులు సరిగ్గా లేకపోవడం, పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడంతో జైనూర్ ఏటిడిఓ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడితో పాటు అదే పాఠశాలలో పనిచేస్తున్న ఫిజిక్స్ ఉపాధ్యాయుడికి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలో పనిచేస్తున్న అధికారులు, ఉపాధ్యాయులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పాఠశాలలో ఆర్‌ఓ ప్లాంట్ పని చేయకపోవడం, విద్యార్థులు తాగునీటి కోసం ఫిజిక్స్ ఉపాధ్యాయుడితో కలిసి బయటకు వెళ్లడం, పాఠశాలలో హాజరు రిజిస్టర్లు, సామాగ్రి నిల్వ రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించకపోవడం వంటి అంశాలను గమనించామని తెలిపారు. ఈ నేపథ్యంలో విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహించిన వారికి షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. విద్యార్థులకు ప్రతిరోజు మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలని, సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, పారిశుధ్య నిర్వహణలో భాగంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వంటశాల, భోజనశాల, మూత్రశాలలు ప్రతిరోజు శుభ్రపరచాలని తెలిపారు.

పార్లమెంట్ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలి



నవతెలంగాణ-నిర్మల్

పార్లమెంట్ ఎన్నికల విధులను పకడ్బందీగా నిర్వహించాలని మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఫ్లయింగ్ స్క్వాడ్ టీం (ఎఫ్ఎస్‌టీ), వీడియో వివింగ్ టీం (వీవీటి), స్టాటిక్స్ సర్వేలయిన్స్ టీం (ఎస్ఎస్‌టీ) లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాల్లో ఓటర్లను ప్రలోభపెట్టే వాగ్దనాలు ఎన్నికల సంఘం చట్టాలకు విరుద్ధమని, వాటిని నియంత్రించాలని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులెవరు పార్టీలకు అనుకూలంగా కార్యక్రమాల్లో పాల్గొన్న రాదని అన్నారు. సామాజిక మాధ్యమాల్లో పార్టీల అనుకూల, వ్యతిరేఖ పోస్టులు పెట్టరాదని అన్నారు. ఎన్నికలకు 48 గంటల ముందు నుంచి ఎటువంటి ప్రచార కార్యక్రమాలకు అనుమతి లేదని అన్నారు. పోలింగ్ కేంద్రానికి వంద మీటర్ల దూరంలో పార్టీల ప్రచారం నిషేధమని తెలిపారు. రాత్రి 10 గంటలు దాటితే ఎన్నికల ప్రచారం చేయరాదని అన్నారు. సరైన పత్రాలు లేకుండా రూ. 50 వేలకు మించి నగదు తీసుకెళ్లరాదని తెలిపారు. అనంతరం సీ విజిల్ యాప్‌పై, ఎన్నికల సంఘం టోల్ ఫ్రీ నెంబర్ 1950 పై అధికారులకు ఈడీఎం నదీమ్ అవగాహనా కల్పించారు. సీ విజిల్‌లో వచ్చిన ఫిర్యాదులపై ఖచ్చితంగా వంద నిమిషాల్లోపు పరిష్కరించేలా ఉండాలని అన్నారు. సీ విజిల్ యాప్ అంశాలపై క్లుప్తంగా వివరించారు. ఈ ఎస్ఎంఎస్ యాప్ గురించి, అధికారులకు అవగాహనా కల్పించారు. వాహనాల తనిఖీల సమయంలో పట్టుబడ్డ నగదు, ఇతర వస్తువులకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను వివరించారు. కార్యక్రమంలో డీఎల్ఎంటీలు శ్రీనివాస్, ఎఫ్ఎస్‌టీలు, వీవీటీలు స్టాటిక్స్ ఎస్ఎస్‌టీలు, అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎం యంత్రాల సెగ్రిగేషన్ ప్రక్రియ పూర్తి

ర్యాండమైజేషన్ పూర్తయిన ఈవీఎం యంత్రాలను సెగ్రిగేషన్ ప్రక్రియ పూర్తిచేసి నియోజకవర్గాల వారీగా అందించడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్ సమీపంలోని ఈవీఎం గోదామును అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిషోర్ కుమార్‌లతో కలిసి ఆయన సందర్శించారు. స్ట్రాంగ్ రూమ్‌ల సీల్‌ను రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో తెరిచి ఈవీఎం యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలలో ఈవీఎం యంత్రాల సంఖ్య ప్రకారం స్ట్రాంగ్ రూమ్‌లలో జాగ్రత్తగా భద్రపరచాలని అధికారులను ఆదేశించారు. ఈవీఎంల తరలింపులో అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని అన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓలు రత్నాకళ్యాణి, కోమల్ రెడ్డి, జీవాకర్, ఎన్నికల సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఆయా రాజకీయ పార్టీల నాయకులు మజార్, శ్రావణ్‌రెడ్డి, గాజుల రవి, అధికారులు, సిబంది పాల్గొన్నారు.

గమ్యం యాప్‌పై అవగాహన

నవతెలంగాణ-బోథ్

మండల కేంద్రంలో బస్టాండ్ ఆవరణలో నిర్మల్ డిపో ఆధ్వర్యంలో గమ్యం యాప్ గురించి ప్రయాణికులకు అవగాహన కల్పించారు. కంట్రోలర్ జీఆర్.రెడ్డి, గంగన్న మాట్లాడుతూ ప్రయాణికుల ఆన్‌డ్రైడ్ ఫోన్‌లలో ప్లే స్టోర్స్‌లోకి వెళ్లి టిఎస్ ఆర్టీసీ గమ్యం అని టైప్ చేసి ఇన్‌స్టాల్ చేసుకోవాలని సూచించారు. అలాగే ఎక్కాల్సిన బస్సు ఎప్పుడు వస్తుందో ఎక్కడి వరకు వచ్చిందో తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రయాణికులు మోటార్ సైకిల్ నడిపేటప్పుడు విధిగా హెల్మెట్ వాడి ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. కారు నడిపే వారు సీట్ బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని కోరారు. ఆర్టీసీ బస్సులో ప్రయాణం సురక్షితం, సుఖవంతం అని తెలిపారు.



నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
బుధవారం | ఏప్రిల్ 17, 2024 | www.navatelangana.com

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

నవతెలంగాణ-కడెం

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అంగన్‌వాడీ టీచర్ విజయ నిర్మల అన్నారు. మంగళవారం మండలంలోని లింగాపూర్ గ్రామంలో ప్రజలకు బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మాయికి 18 సంవత్సరాలు, అలాగే అబ్బాయికి 21 సంవత్సరాలు నిండిన తర్వాతే వివాహాలు నిశ్చయించాలని అన్నారు. బాల్యవిహాలు చేయడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని అన్నారు. పిల్లల



తల్లిదండ్రులు బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని తెలిపారు. ఎవరైనా నిబంధనలకు విరుద్ధంగా బాల్య వివాహాలు నిర్వహించినచో చట్టరీత్యా చర్యలు తీసుకోబడునని వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీలు మేకర్తి మంగ, శ్రీలత, నారాయణ, వెంకటరమణ, పూజారులు మధుసూదన్, రామస్వామి పాల్గొన్నారు.

గిరి గ్రామాల్లో భానుడి భగభగ

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని గిరి గ్రామాల్లో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరగడంతో భానుడి భగభగ ఎండ వేడితో ప్రజలు అల్లాడి పోతున్నారు. ఉదయాన్నే కూలీలు, రైతులు, పనికి వెళ్లి ముగించి వస్తున్నారు. ఉదయం 11గంటలు దాటితే ప్రజలు బయటకు రావడానికి జంకుతున్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో మంగళవారం ఉట్నూర్ వైపు నుంచి నార్నూర్ వైపు వెళ్లే రహదారి నిర్మానుష్యంగా మారింది. అత్యవసర పనుల తప్ప ప్రజలు బయటికి రావడానికి జంకుతున్నారు. మరోపక్క కూలీలకు పని ప్రదేశాల్లో ఎండ తాకకుండా జాగ్రతలు పాటించే విధంగా అదికారులు అవగాహన కల్పిస్తున్నారు. ఉపాధిహామీ పనుల్లో భాగంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్నారు.



కష్టపడి చదివి ఉన్నత స్థానంలో నిలవాలి

- యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి
- ఎస్పీ గౌస్ ఆలం



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌస్ ఆలం

నవతెలంగాణ-సిరికొండ

యువకులు పట్టుదలతో కష్టపడి చదివి ఉన్నతమైన స్థానంలో నిలువాలనే సంకల్పం ఉండాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం అన్నారు. మంగళవారం మండలంలోని చిమ్మన్‌గుడి గ్రామంలో పోలీస్‌ల ఆధ్వర్యంలో ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామానికి విచ్చేసిన జిల్లా ఎస్పీ గౌస్ ఆలం, జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బి పాటిల్‌లకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. డోలు వాయిద్యాలతో, తమ సాంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. వారితో పాటు అధికారులు కలిసి నృత్యం చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గంజాయి పంటను ఎవరు సాగు చేయొద్దని అన్నారు. వాహనాలను నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని అన్నారు. తమ పంట పొలాల్లో విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయొద్దని అన్నారు. విద్యుత్ కంచెలను ఏర్పాటు చేయడం వల్ల, విద్యుత్ షాక్ తగిలి జిల్లాలో ఆరుగురు మృతి చెందారని అన్నారు. నక్సలైట్‌లకు ఎవరు సహకరించవద్దని, యువత అటువైపు వెళ్లి తమ బంగారు భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని అన్నారు. గ్రామంలోకి నక్సలైట్లు వస్తే తమకు సమాచారం అందజేయాలని అన్నారు. వారికి తగిన నగదు పారితోషికం అందజేస్తామని అన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తమ హక్కును వినియోగించుకోవాలని అన్నారు. ఓటు వేస్తేనే ఎవరినైనా ప్రశ్నించే హక్కు ఉంటుందని అన్నారు. జిల్లా అటవీ శాఖ అధికారి ప్రశాంత్ బీ పాటిల్ మాట్లాడుతూ మండలంలో అనేక గ్రామాలకు రోడ్డు సౌకర్యాల అనుమతులు కొన్ని పెండింగ్‌లో ఉన్నాయని ఎన్నికల తర్వాత వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. త్రిఫేజ్ కరెంట్ సౌకర్యం కల్పిస్తామని అన్నారు. గ్రామంలో ఎవరు కూడా కలప స్మగ్లింగ్ పాల్పడవద్దని అన్నారు. అటవీ సంరక్షణ చట్టాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలని అన్నారు. బీడీ ఆకులను విక్రయించేటప్పుడు తమ పోస్టల్ అకౌంట్‌లను ఇవ్వాలని కోరారు. తమ పంట పొలాల్లో విద్యుత్ తీగలు అమర్చి వన్య ప్రాణులను చంపొద్దని అన్నారు. సమస్యలను తప్పకుండా పరిష్కరించేందుకు కృషి చేస్తామని అన్నారు. అనంతరం తెలంగాణ పోలీస్ నార్కోటిక్స్, మావోయిస్టులకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్, ఇచ్చోడ సీఐ భీమేశ్, సిరిచెల్మ టైగర్ జోన్ అధికారి గణేష్, సిరికొండ, నేరడిగొండ ఎస్సైలు నవీన్, శ్రీకాంత్, జెడ్పీటీసీ చంద్రకళ రఘురాం, ఎంపీపీ అమృత్‌రావ్, పలు గ్రామాల నాయకులు, పోలీస్, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.



స్వాగతం పలుకుతున్న గిరిజన మహిళలు

ఆశాలతో తెమడ డబ్బాలు మోయించడం సరికాదు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశాలతో తెమడ డబ్బాలు మోయించడం సరికాదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న అన్నారు. మంగళవారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో రిమ్స్‌లోని జిల్లా క్షయ నియంత్రణ కేంద్రం టీబీ విభాగం వైద్యాధికారి డాక్టర్ సాయిప్రియకు వినతిపత్రం అందజేశారు. తెమడ డబ్బలను తీసుకురావడం టార్గెట్ పెట్టి ఆశాలని ఇబ్బంది పెడుతున్నారన్నారు. తెమడ డబ్బాల టార్గెట్ పూర్తి కాకపోతే పారితోషకాలు కట్ చేస్తామని అంటున్నారని ఇది సరికాదన్నారు. తాము పనిచేసే పీహెచ్‌సీ పని ఏరియాలో ప్రజలు ఇవ్వడానికి ఇబ్బందిపడుతున్నారన్నారు. వారికీ మోటివేషన్ చేసిన ముందుకు రావడం లేదని, కానీ గతంలో చేసిన తెమడ డబ్బాల పారితోషికం గత 3 సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇలాంటి పనిని టార్గెట్ చేయొద్దని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు అగ్గిమల్ల స్వామి, ఆశా యూనియన్ జిల్లా కార్యదర్శి ఎం.సుజాత, ఆశా యూనియన్ నాయకులు మాదవి, స్వరూప, ఆశా, అరుణ, గంగమ్మ, కవిత, జామున, పద్మ పాల్గొన్నారు.

ఫారెస్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి

నవతెలంగాణ-నేరడిగొండ

ఫారెస్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని మంగళవారం ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయల శంకర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. అనంతరం తమ సమస్యలను విన్నవించారు. తాము గత 15నుంచి 20 సంవత్సరాలుగా ఫారెస్ట్ డిపార్ట్‌మెంట్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్నామని అన్నారు. అకారణంగా విధుల్లో నుంచి తొలగించిన వారిని పేస్కేల్ ద్వారా విధుల్లోకి తీసుకోవాలని కోరారు. లేదంటే మూడు వేల కుటుంబాలను రోడ్డున పడేట్టు చేశారని అన్నారు. ఇప్పటికైనా తమ బాధలను అర్థం చేసుకొని మమ్మల్ని విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి రాజు, మునీర్. లక్ష్మీనారాయణ, నగేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆలోచనలు ఆచరించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌ను ఆరాధించడమే కాకుండా ఆయన ఆలోచనలను ఆచరించాలని లుంబిని బుద్ధ విహార్ కమిటి సభ్యులు బోరేకార్ భీంరావ్ అన్నారు. మంగళవారం పిప్పల్‌ధరి గ్రామంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు బోరేకర్ భీంరావ్ రూ.40వేల ఆర్థిక సాయాన్ని అంబేద్కర్ విగ్రహ నిర్మాణ కమిటి సభ్యులకు బోరేకర్ భీంరావ్ ఆయన కుమారుడు బోరేకర్ సోమన్న, కోడలు విశాఖ, మనుమరాళ్లతో కలిసి నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరికీ స్ఫూర్తి, దారి చూపిన మహనీయుడు అంబేద్కర్ అన్నారు. కుల వివక్షను రూపుమాపి పేదలను ఆదుకున్నారు. ప్రపంచంలో అన్నింటికంటే ఎక్కువ అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయన్నారు. కుల వ్యవస్థను దూరం చేయడమే అంబేద్కర్ ఆశయమని, ఆయన స్ఫూర్తితో అందరం కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఆనంతరం ఆయన చేసిన సాయాన్ని పలువురు గ్రామస్తులు అభినందరించారు. ఈ కార్యక్రమంలో భగత్‌వసంత్, తాక్సాండే దివాకర్, గులే మోహన్, మునేశ్వర్ విఠల్, గులే ఆనంద్, సోనజోకే లాను, తాక్సాండే రాహుల్, టంటే మనోహర్ ఉన్నారు.

నేరాల నియంత్రణపై అవగాహన

- ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి



నవతెలంగాణ-కడెం

మండలంలో లింగాపూర్, గ్రామ ప్రజలకు మత్తు పదార్థాలు, నేరాల నియంత్రణపై కడెం ఎస్సై కృష్ణ సాగర్‌రెడ్డి మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలతో కడెం ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి మాట్లాడుతూ పిల్లలు క్రమశిక్షణతో నడుచుకునే విధంగా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులదని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు రోజు ఎటు వెళ్తున్నారు ఏం చేస్తున్నారని చూడాల్సిన బాధ్యత ఉందన్నారు. మైనర్లకు డ్రైవింగ్ లైసెన్స్ లేని వారికి బైకులు, కానీ ట్రాక్టర్‌లు కానీ ఇవ్వకూడదని హెచ్చరించారు. యువత మత్తు పదార్థాలకు బానిసలు కావద్దని హెచ్చరించారు. యువత మంచి మార్గంలో నడుస్తూ, ఉన్నత స్థాయి ఎదగాలని తెలిపారు. దొంగతనాల పట్ల ప్రజలు జాగ్రత్త ఉండాలని తెలియజేశారు. శాంతి భద్రతల దృష్ట్యా ప్రజలకు ఎలాంటి సహాయ సహకారాలు కావాలన్నా పోలీసులు సిద్ధంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కడెం పోలీస్ సిబ్బంది, లింగాపూర్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు



పరిసరాలను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

నవతెలంగాణ-నిర్మల్

పరిసరాల పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం పట్టణంలోని ఈద్‌గాం, శివాజీచౌక్‌లోని కూడళ్లను, డ్రైనేజిలను పరిశీలించి అధికారులకు ఆయన పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రధాన్యతనివ్వాలని పారిశుధ్య కార్యక్రమాలు నిరంతరం చేపట్టాలని మున్సిపల్ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. పట్టణంలోని ప్రతి ఇంటి నుంచి తడి, పొడి చెత్తను వేరు వేరుగా సేకరించి, డంపింగ్ యార్డుకు తరలించాలని సూచించారు. ప్రధాన కూడళ్ల, రహదారులు, డ్రైనేజిలను శుభ్రంగా ఉంచాలని అన్నారు. రోడ్లపై చెత్త వేస్తే, షాప్, హోటల్, మాల్స్, హాస్పిటల్స్ యజమానులపై అపరదా రుసుము విధించాలని ఆదేశించారు. పారిశుధ్య కార్యక్రమాల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వందశాతం ఆస్తి పన్ను వసూలును పూర్తి చేయాలనీ ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, మున్సిపల్ కమిషనర్ రాజు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలి

- స్వీప్ ప్రచార రథం ప్రారంభించిన కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మంగళవారం జెడ్పీ సమావేశ మందిరంలో స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటుపై అవగాహన కార్యక్రమం చేపట్టారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅతిథిగా హజరయ్యారు. అనంతరం స్వీప్ ప్రచార రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 1 ఏప్రిల్ 2024 వరకు ఎవరైతే 18 సంవత్సరాల నిండినవారు ఉన్నారో వారి పేరు ఓటరు జాబితాలో ఉండాలన్నారు. ఓటరు జాబితాలో ఉంటేనే ఓటు హక్కు వినియోగించుకోవచ్చన్నారు. దాని కొరకు బీఎల్‌ఓలు, ఈఆర్ఓ, తహసీల్దార్ ఏప్రిల్ 15వ వరకు ఫాం-6 తీసుకుని వారిని ఓటరుగా నమోదు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో ఉన్న దివ్యాంగులు, ట్రాన్స్ జెండర్లు, వయోవృద్దులు ఎన్నికలలో ఓటు వేసి వారి ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు వేయడంతో పాటు, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ ఓటు వేసే విధంగా చైతన్యం పరచాలని అన్నారు. ట్రాన్స్ జెండర్లు ఓటు వేయడమే కాకుండా,



ఓటింగ్‌పై అవగాహన కల్పించే విధంగా కృషి చేయాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు చేశాం...

పోలింగ్ కేంద్రాల్లో అన్ని సదుపాయాలు ఏర్పాటు చేశామని తెలిపారు. 85 సంవత్సారాలు దాటిన వయోవృద్దులు, 45 శాతం కంటే ఎక్కువ వికలాంగత్వం ఉన్న పోలింగ్ కేంద్రానికి రాలేని స్థితిలో ఉన్న వారికి మాత్రమే హోమ్ ఓటింగ్ సదుపాయాన్ని కల్పించడం జరుగుతుందని తెలిపారు. దివ్యాంగులు అందరూ పోలింగ్ కేంద్రానికి వచ్చి ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు. దివ్యాంగులకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద వీల్ చైర్ల ఏర్పాటు, ర్యాంపులు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి, డీవైఎస్‌ఓ వెంకటేశ్వర్లు, సీనియర్ సిటిజన్స్, బీఎల్‌ఓస్, ట్రాన్స్ జెండర్స్ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

- డీఆర్డీఓ విజయలక్ష్మి



నవతెలంగాణ-కడెం

గ్రామీణ ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకొని, లబ్ధి పొందాలని డీఆర్డీఓ విజయలక్ష్మి సూచించారు. మంగళవారం మండలంలోని ధర్మాజీపేట్, లింగాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించి, పలు సూచనలు చేశారు. అనంతరం ధర్మాజీపేట్ నర్సరీని పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. ఈ వేసవి కాలం దృష్ట్యా, కూలీలు వడదెబ్బ తాకకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పని ప్రాంతంలో నీడ, తాగునీటి సౌకర్యం కల్పించాలని సిబ్బందికి ఆదేశించారు. నర్సరీలో మొక్కల సంరక్షణకు ఈ వేసవిలో ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ జయదేవ్, టీఏ గణేష్, ఎఫ్ఏలు శేఖర్, రాజు ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను ఖండిస్తున్నాం

- ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం రేవంత్ రెడ్డి ఎమ్మార్పీఎస్ ఉద్యమం పట్ల మంద కృష్ణ మాదిగ గురించి అహంకారంతో కుట్ర బుద్ధితో మాట్లాడుతూ మాదిగలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఆరెల్లి మల్లేష్ తెలిపారు. మంగళవారం అంబేద్కర్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్టంలో మూడు ఎస్సీ పార్లమెంటు స్థానాలతో పాటు ఒక్క కంటోన్మెంట్లో ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలకు ఒక సీటు అవకాశం ఇవ్వకుండా, పైగా మాదిగలకు ఏదో ఒరగపెట్టినట్లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఇదే రేవంత్ రెడ్డి మాట్లాడుతూ నా సొంత కులం కంటే ఎక్కువగా మాదిగల మద్దతుతో వారి పుణ్యంతో ఈ స్థాయికి ఎదిగిన అని మాదిగలు నిర్వహించిన వేదికల మీద మాట్లాడిన మాటలు ఇప్పటికి రికార్డుగా ఉన్నాయన్నారు. మాదిగల ఆవేదన పట్టించుకోకుండా సామాజిక న్యాయాన్ని విస్మరించి రిజర్వేషన్ అవకాశాలను తుంగలో తొక్కి అధిక జనాభా ధమాషా కలిగిన మాదిగలను అణిచి వేస్తున్నారన్నారు. ఒకే సామాజిక వర్గానికి రేవంత్ రెడ్డి తన కుర్చుని కాపాడుకునేందుకు ఎస్సీలో ఒకే సామాజిక వర్గానికి వత్తాసు పలుకుతున్న మాదిగల ద్రోహి రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ విధానాన్ని తమ జాతి గమనిస్తుందన్నారు. ఈ ఎన్నికల్లో మాదిగల శక్తితో ఓటు చైతన్యంతో మంద కృష్ణ మాదిగ పిలుపుమేరకు చిత్తుచిత్తుగా కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించి తీరుతామన్నారు. ఉమ్మడి రాష్ట్ర చరిత్రలో నీలాంటి ఎందరో ముఖ్యమంత్రులను ఎదుర్కొన్న చరిత్ర ఎమ్మార్పీఎస్‌కు ఉన్నదన్నారు. రెండు పార్లమెంటు స్థానాలతో పాటు అసెంబ్లీ టికెట్ కూడా మాదిగలకు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి శ్రీను, ఆర్ సందీప్, అజయ్, గణేష్, రాజు పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలి



నవతెలంగాణ-ఖానాపూర్‌టౌన్

పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి గోడం నగేష్ గెలుపుకోసం కార్యకర్తలంతా కలిసి కట్టుగా పనిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు కూనింటి అంజుకుమార్ సూచించారు. మంగళవారం ఆయన ఖానాపూర్‌లో పర్యటించి, కార్యకర్తలకు దిశ నిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించాలని అన్నారు. ఇంద్రానగర్‌లో ఆయన ఇంటింటా ప్రచారాన్ని ప్రారంభించి మాట్లాడారు. దేశం అభివృద్ధిలో ముందుకు సాగాలంటే నరేంద్ర మోడీ ని మూడోసారి ప్రధాని కావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఏ.మహేందర్, నాయిని సంతోష్, ఆకుల శ్రీనివాస్, దాసరి శ్రీనివాస్, దాదె మల్లయ్య, సత్యవతి, గోపాల్ రెడ్డి, ఎనగందుల రవి, పరమేష్ గౌడ్, సుధాకర్, కమళాకర్, రంజిత్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులను పరిశీలించిన ఎంపీడీఓ

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మండల కేంద్రంతో పాటు ఆడేపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ ప్రసాద్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పని చేసే కూలీలకు దినసరి కూలీ రూ.300 పెరిగాయని తెలిపారు. అందుకు తప్పనిసరిగా కొలతల (మెజర్మెంట్) ప్రకారం పని చేస్తే రూ. 300 ప్రతి కూలీకి చెల్లించడం జరుగుతుందన్నారు. కూలీ పూర్తి పనిచేసి, పూర్తి డబ్బులు తీసుకునే విధంగా ఉండాన్నారు. లేదా పూర్తి పని చేయకుండా కూలీ రూపాయలు తక్కువ వచ్చాయని అధికారులని నిలదీయలేని పరిస్థితి ఉంటుందని తెలిపారు. ఆయనతో పాటు కార్యదర్శి ఆసిఫ్ అలి ఉన్నారు.

నైతిక విలువలు నేర్పడమే శిశు మందిరాల లక్ష్యం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



విద్యార్థులకు నైతిక విలువలు నేర్పడమే శిశు మందిరాల లక్ష్యమని సిద్దిపేట ప్రబంధకారిణి సభ్యులు కాశీనాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన విద్యాపీఠ ఆవిర్భావ వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరస్వతీ శిశు మందిర్ పాఠశాలలు విద్యార్థులకు విద్యతో పాటు నైతిక విలువలు నేర్పుతాయన్నారు. నేటి సమాజంలో విలువల పాత్ర ఎంతో గొప్పదన్నారు. అనంతరం శ్రీరామనవమి వేడుకలు ముందస్తుగా పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సమితి కార్యదర్శి నాగుల శ్రీనివాస్, పాఠశాల కార్యదర్శి కొడిప్యాక వేణుగోపాల్, కల్లూరి సంతోష్, ప్రసాద్, హెచ్ఎం కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో కొనసాగుతున్న సాంఘిక సంక్షేమ గురుకులాలకు సొంత భవనాలు నిర్మించాలని కేవీపీఎస్, డీవైఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల ఆర్సీఓ స్వరూప రాణికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ గురుకుల పాఠశాల, కళాశాలలో సమస్యలను పరిష్కరించాలని కోరారు. రెబ్బెన మండలంలోని గురుకుల బాలికల పాఠశాల బీసీ బాలుర హాస్టల్‌లో కొనసాగుతుందని, అక్కడ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక విద్యార్థులు ఇరుకు గదులలో విద్యను అభ్యసిస్తున్నారని తెలిపారు. ఒకే గదిలో 80 మంది విద్యార్థులు ఉండాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఇదే విషయాన్ని ప్రిన్సిపల్ దృష్టికి తీసుకెళ్లడానికి ప్రయత్నించగా అందుబాటులో ఉండడం లేదన్నారు. సిర్పూర్ (టీ) బాలుర పాఠశాల పరిస్థితి కూడా అధ్వానంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. గురుకులాల ప్రిన్సిపల్స్ స్థానికంగా అందుబాటులో ఉండడం లేదని ఆరోపించారు. దీంతో పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించడంలో జాప్యం జరిగి విద్యార్థులు ఇబ్బందులు పడాల్సి పరిస్థితి తలెత్తుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తిక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ ఉన్నారు.

ఆరు గ్యారెంటీలపై అవగాహన కల్పించాలి

- డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు



నవతెలంగాణ-కెరమెరి

ఆరు గ్యారెంటీలపై కాంగ్రెస్ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు కొక్కిరాల విశ్వప్రసాద్ రావు అన్నారు. మంగళవారం మండలంలోని పెద్ద సాకడ గ్రామంలో మోడీ మాజీ సర్పంచ్ పెందూర్ జలపతి రావుతో పాటు 50మంది బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లా అధ్యక్షుడు విశ్వ ప్రసాద్ రావు వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని జోస్యం చెప్పారు. బడుగు బలహీన వర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ కృషి చేస్తుందని తెలిపారు. ఆదిలాబాద్ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి ఆత్రం సుగుణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు ఆత్రం కుసుంబ్ రావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్ అహ్మద్, మాజీ జడ్పీటీసీ ఆత్రం లక్ష్మణ్, యూత్ మండల అధ్యక్షులు దండుగుల శ్రీనివాస్, మహిళా నాయకురాలు ఇంద్ర, నాయకులు బాబు నాయక్, నగేష్, రమేష్, కొట్రంగే తిరుపతి, రాథోడ్ గోపి, సోంజీ, పెందూర్ వినేష్ పాల్గొన్నారు.

అగ్గి అంటకుండా..అడవి కాలిపోకుండా..!

- ఫైర్‌లైన్ల ఏర్పాటుతో ప్రమాద నివారణకు మార్గం
- పర్యావరణ రక్షణ కోసం అటవీశాఖ చర్యలు

ప్రస్తుత వేసవిలో ఏ చిన్న అగ్ని ప్రమాదం జరిగిన పెనుముప్పుగా మారే అవకాశం లేకపోలేదు. కాస్తంత ఏమరుపాటుతో.. చిన్నచిన్న తప్పిదాలతో దావాగ్నిగా మారితే అటవీ బుగ్గిపాలు కావాల్సిందే. అటవీ ప్రాంతంలో పశువులు మేపడానికి వెళ్లినవారు, ఆ ప్రాంతం గుండా వెళ్తున్నవారు బీడీలు, సిగరెట్లు తాగి పడేసిన మంటతో అటవీ ప్రాంతంలో మంటలు చెలరేగి ఆకులు, చెట్లు కాలిపోయి వన్యప్రాణులకు హాని జరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యం దెబ్బతింటుంది. దీని నుండి రక్షించడానికి అటవీ శాఖ సిబ్బంది డిసెంబర్ నుంచి ఫైర్ లైన్ల నిర్వహణతో అటవీలో అగ్ని నివారణకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది.

నవతెలంగాణ- ఆసిఫాబాద్

జిల్లాలో మొత్తం 11 అటవీ రేంజ్‌లు, రెండు డివిజన్లు ఉన్నాయి. వీటిలో 2445.40 చదరపు కిలోమీటర్ల అటవీ ప్రాంతం ఉంది. ఇతర జిల్లాలతో పోలిస్తే దీనిలో ఎక్కువగా టేకు ఉండడంతో వేసవి కాలంలో ఆకులు రాలి ఎండిపోవడంతో చిన్న నిప్పు రవ్వపడినా పెద్ద అగ్నిప్రమాదం జరిగే అవకాశాలున్నాయి. ఈ క్రమంలోనే అటవీ శాఖ అధికారులు అటవీ ప్రాంతాల్లో అగ్గి పడకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నారు. డిసెంబర్ నుండి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు అడవిలో అగ్గి కనిపిస్తే సమాచారం అందించాడానికి అందుబాటులో ఫోన్ నెంబర్లు కూడా ఉంచారు.

ఫైర్‌లైన్ల ఏర్పాటుతో పటిష్ట చర్యలు

జిల్లాలోని 243 బీట్‌లలో అటవీ ప్రాంతంలో అగ్గి పడకుండా అటవీ అధికారులు ముందస్తుగా ఫైర్ లైన్లను ఏర్పాటు చేశారు. బ్లోయర్ల సహాయంతో ఆకులు దగ్గరికి చేసి అంటిస్తారు. దీనితో రోడ్డు మీద నుండి ఈ లైన్ దాటి లోపలికి వెళ్లే పరిస్థితులు తక్కువగా ఉంటాయి. ప్రతి సంవత్సరం అటవీ అధికారులు ఈ చర్యలు చేపట్టి కొంత అడవీ కాలిపోకుండా చూస్తున్నారు. అగ్గి పడితే వన్యప్రాణులకు నష్టం జరగడమే కాకుండా పర్యావరణ సమతుల్యత కూడా దెబ్బతింటుందని అధికారులు చెబుతున్నారు.

పర్యావరణ రక్షణకై అటవీశాఖ కృషి

ఫైర్ లైన్లతో పాటు గతంతో పోలిస్తే అడ్వాన్స్ టెక్నాలజీని వాడి పర్యావరణ రక్షణ కోసం అటవీశాఖ కృషి చేస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడ అడవిలో అగ్గి పడకుండ ఫారెస్ట్ వన్ అగ్ని పోర్టల్ సాటిలైట్ ద్వారా వెంటనే సంబంధిత రేంజ్ కార్యాలయంతో పాటు బీట్ అధికారి మొబైల్‌కు జీపీఎస్ పాయింట్‌తో సంక్షిప్త సందేశం వస్తుంది. దీనితో వెంటనే ఆయా బీట్, సెక్షన్, రేంజ్ అధికారులు అలర్ట్ అయి మంటలు ఆర్పుతున్నారు. దీనితో పర్యావరణానికి ఇబ్బంది కాకుండా అనునిత్యం కృషి చేస్తున్నారు.

గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు

అడవిలో పడే అగ్గికి సంబంధించి గ్రామాల్లో నవంబర్, డిసెంబర్ నుండి అటవీ అధికారులు పెద్ద ఎత్తున వేసవి కాలం వరకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనితో పాటు పోస్టర్ల ఆవిష్కరణ, వాటిని గ్రామాల్లో అంటించడం ప్రత్యేక మొబైల్ నెంబర్లు గ్రామస్తులకు ఇవ్వడం లాంటి కార్యక్రమాలు చేస్తున్నారు. ఎవరికైనా అడవిలో అగ్గి కనిపిస్తే వెంటనే ఆ నెంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలని కోరుతున్నారు. అలాగే నిధులు అందుబాటులో ఉన్నచోట ఫైర్ వాచర్లను నియమిస్తున్నారు.



మంటలర్పుతున్న బీట్ అధికారిణి(ఫైల్)

అడవిలో అగ్గి పడకుండా ముందస్తు చర్యలు

అప్పలకొండ, ఎఫ్ఆర్ఓ, ఆసిఫాబాద్



వేసవికాలంలో చెట్ల నుండి పెద్ద ఎత్తున ఆకులు రాలి ఎండిపోయి ఉండడంతో అగ్గిపడే అవకాశం ఎక్కువగా ఉంటుంది. దీనితో పర్యావరణ సమతుల్యం కొంత దెబ్బతింటుంది. ఇలా జరగకుండా ప్రతి బీట్‌లలో ఫైర్ లైన్ ఏర్పాటు చేసి అడవిలోకి అగ్గి వెళ్లకుండా చేస్తున్నాం. ప్రజలు కూడా తమకు సహకరించి పశువుల కాపరులు లేదా పాదచారులు బీడీలు తాగడం లాంటివి చేసినప్పుడు అగ్గిపుల్లలు ఆర్పివేయాలి. అలా చేసినప్పుడే పర్యావరణ సమతుల్యత కాపాడే అవకాశం ఉంటుంది. ప్రజలు సహకరించినప్పుడే అడవిలో అగ్గి పడకుండా చూసే అవకాశం ఉంటుంది. ప్రత్యేక సాటిలైట్ ద్వారా ఎప్పటికప్పుడు అగ్ని గుర్తించి ఆర్పడంతో పాటు సిబ్బంది తీసుకోవాల్సిన చర్యలపై ప్రతిరోజు వారికి నిబంధనలు వివరిస్తున్నాం. సాధ్యమైనంత వరకు అడవిలో అగ్గి పడకుండా చూస్తున్నాం.

బడికి పోవాలంటే.. నడవాలి

- మండుటెండలో విద్యార్థుల కాలినడక

నవతెలంగాణ-చింతలమానేపల్లి



ఎండలో నడ్చుకుంటు వస్తున్న విద్యార్థినులు

విద్యతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని, ప్రతి ఒక్కరు చదువుకోవాలని అధికారులు, ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు పదేపదే చెబుతున్నారు. అయితే దానికి తగట్టుగా సౌకర్యాలు, వసతులు కల్పించడం లేదు. మండుటెండలో చదువు కోసం విద్యార్థులు కిలో మీటర్ల కొద్ది నడవాల్సిన పరిస్థితి. వేసవిలో పాఠశాలలను ఒంటిపూటనే కొనసాగిస్తున్నారు. మధ్యాహ్నం ఒంటిగంటకు తిరిగి ఇంటికి వస్తున్నారు. ఆసమయంలో ఎండలు తీవ్రంగా మండుతుండడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో రుద్రాపూర్ గ్రామం నుండి 55 మంది విద్యార్థులు చదవుతున్నారు. చింతలమానేపల్లి మండల కేంద్రంలోని పాఠశాలకు ఈ గ్రామం 3, 4 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఒంటిపూట బడి ఉన్నందున విద్యార్థులు ప్రతిరోజు ఉదయాన్నే పాఠశాలకు కాలి నడకతో వచ్చి, మిట్ట మధ్యాహ్నం తిరిగి ఇండ్లకు వెళ్తున్నారు. ఎండ వేడిని తట్టుకోలేక, వారి వద్ద ఉన్న దుస్తులతోనే తలపై వేసుకొని నడకదారితో వెళ్తున్నారు. ఏప్రిల్ 23 వరకు పాఠశాల ముగింపు చివరి రోజు ఉంది. ఏప్రిల్ మాసం మొదటి నుండే ఎండ, వేడి గాలులు వీస్తున్నాయి. వీటిని తట్టుకొని విద్యార్థులు రోజు పాఠశాలలకు వస్తున్నారు. చదువుపై ఉన్న వారి శ్రద్ధకు నిదర్శంగా చెప్పవచ్చు. ఎండవేడికి చాలా ఇబ్బందులు పడుతున్నామని, పాఠశాల ముగింపు సమయంలో ఆర్టీసీ బస్సు కూడా లేకపోవడంతో కష్టాలు పడుతున్నామని విద్యార్థులు చెబుతున్నారు. వాహనాలు లేక కాలినడుపుతోనే ఇండ్లకు చేరుకుంటున్నమని పేర్కొన్నారు. పాఠశాల వారం రోజులు ఉన్నందున, పాఠశాల ముగింపు సమయంలో ఆర్టీసీ బస్సు లేక ఆటో సౌకర్యం కల్పిస్తే బాగుంటుందని కోరుతున్నారు.

యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత మత్తు పదార్థాలకు బానిస కాకుండా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర యాంటీ నార్కోటిక్స్ బ్యూరో ఆధ్వర్యంలో గంజాయి, కల్తీ కల్లు వినియోగం వల్ల జరిగే అనర్థాలపై రూపొందించిన వాల్ పోస్టర్‌ను అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంజాయికి బానిసలుగా మారి యువత తమ భవిష్యత్తు నాశనం చేసుకొంటుందన్నారు. దాని వలన వారి జీవితాలు విచ్ఛిన్నం కావడంతో పాటు తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురైవుతున్నారన్నారు. గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలనకు ప్రజలందరు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి గంజాయి, మత్తు పదార్థాల విక్రయాలకు పాల్పడేవారి సమాచారాన్ని ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. గంజాయి రహిత జిల్లా కోసం అధికారులు, సిబ్బంది కృషి చేయాలనీ సూచించారు. వాల్ పోస్టర్లలో సమాచారం అందించాల్సిన నెంబర్లు ఉన్నారని ప్రజలు సమాచారం ఇచ్చి పోలీసులకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమములో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) ప్రభాకర్ రావు, ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య, టౌన్ సీఐ సతీష్, డీసీఆర్బీ సీఐ రమేష్, ఆర్ఐ అడ్మిన్ పెద్దయ్య పాల్గొన్నారు.

జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీయేనా?

- బీజేపీ వైపు అరిగెల బ్రదర్స్ చూపు
- మనస్పర్ధలా..? పార్టీలో ప్రాముఖ్యత లేకపోవడమా..?



ఎంపీపీ మల్లికార్జున్



జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు



సోమవారం ప్రచారంలో భాగంగా ఎంపీపీని కలిసి గోడం నగేష్ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఒకప్పుడు వెలుగు వెలిగిన బీఆర్ఎస్ ప్రస్తుతం దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయిన తర్వాత ఒక్కొక్కరిగా జిల్లాలోని నేతలు బీఆర్ఎస్ నుండి ఇతర పార్టీలోకి వెళ్తున్నారు. ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడితో పాటు అనేక మంది కాంగ్రెస్‌లోకి వెళ్లగా తాజాగా ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నాయకులు అరిగెల బ్రదర్స్ బీజేపీలో చేరేందుకు నాయకులతో టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీనితో ఎంపీ ఎన్నికల సమయం నాటికి జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీ అవుతుందేమోననే అనుమానం కలుగుతోంది. సామాజిక మాధ్యమాల్లో ఇప్పుడు ఇదే ట్రెండ్‌గా మారింది.

జిల్లాలో బీఆర్ఎస్ ఖాళీయేనా..?

ఆసిఫాబాద్ జిల్లాలో ఒకప్పుడు వార్డ్ మెంబర్ దగ్గర నుండి ప్రారంభిస్తే జడ్పీ చైర్మెన్ వరకు బీఆర్ఎస్ నేతలు కనిపించేవారు. ఇతర పార్టీలకు చెందిన నేతల కార్యక్రమాలు చాలా తక్కువగా కనిపించేది. గడిచిన అసెంబ్లీ ఎన్నికల తర్వాత ఇది పూర్తిగా మారిపోయింది. జిల్లాలోని రెండు ఎమ్మెల్యేలలో ఆసిఫాబాద్ బీఆర్ఎస్ సొంతం చేసుకున్నప్పటికీ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కోనేరు కోనప్పతో పాటు జడ్పీ చైర్మన్ కృష్ణ, రెబ్బెన జడ్పీటీసీ సంతోష్‌తో పాటు కాగజ్‌నగర్ నియోజకవర్గంలోని చాలా మంది నాయకులు అధికార పార్టీలోకి వెళ్లారు. దీంతో బీఆర్ఎస్ ఖాళీ అయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

బీజేపీ వైపు అరిగెల బ్రదర్స్ చూపు..?

ఇప్పటికే సిర్పూర్ నియోజకవర్గంలో నుండి పెద్ద ఎత్తున అధికార పార్టీతో పాటు బీజేపీలోకి నాయకులు వలస వెళ్లగా తాజాగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కూడా అదే పరిస్థితి కనిపిస్తోంది. నియోజకవర్గానికి చెందిన ప్రముఖ నేత ఆసిఫాబాద్ జడ్పీటీసీ నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో సహా మండలానికి చెందిన పలువురు నాయకులు బీజేపీ టచ్‌లోకి వెళ్లినట్లు తెలుస్తోంది. దీనిని బలం చేకూరుస్తూ బీఆర్ఎస్ మాజీ నాయకుడు బీజేపీ ప్రస్తుత ఎంపీ అభ్యర్థి గొడం నగేష్ సోమవారం ప్రచారానికి వచ్చి జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్‌తో సహా నాయకులు ఎంపీపీ మల్లికార్జున్‌ను ఆయన నివాసంలో కలవడం మరింత చర్చకు దారి తీసింది. ఏది ఏమైనా అరిగెల బ్రదర్స్ పార్టీ మారితే బీఆర్ఎస్‌కు మరింత కష్టాలు ఎదురయ్యే అవకాశం ఉంటుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

మనస్పర్ధలా..? ప్రాముఖ్యత లేకపోవడమా..?

గతంలో టీడీపీలో చురుకుగా పనిచేసిన అరిగెల బ్రదర్స్ బీఆర్ఎస్‌లో చేరిలో రాష్ట్ర ఆవిర్భావం తర్వాత పార్టీ అభివృద్ధి కోసం కృషి చేశారు. అయితే ప్రస్తుత ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ విఠల్, ఎమ్మెల్యే కోవ లక్ష్మితో కొంత మనస్పర్ధలు వచ్చినట్లు తెలుస్తోంది. దీంతో పార్టీ మారడానికి ఆలోచిస్తున్నట్లు కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు రాజీనామా తర్వాత ఆ పదవీ జిల్లాలో ముఖ్య నాయకుడైన అరిగెల నాగేశ్వరరావుకు ఇస్తారని కార్యకర్తలతో పాటు తాను కూడా భావించినప్పటికీ అది వేరే నేతకు ఇస్తున్నట్లు సమాచారం. ఈ రెండు కారణాలతో పార్టీని వీడడానికి సిద్ధమవుతున్నట్లు తెలిసింది.

సామాజిక మాధ్యమాల్లో ప్రచారం

అరిగెల బ్రదర్స్ పార్టీ మారుతున్నట్లు సామాజిక మాధ్యమంలో పెద్ద ఎత్తున ప్రచారం కొనసాగుతోంది. ఇదే విషయంపై నాయకులను అడగడానికి ప్రయత్నం చేయగా అందుబాటులోకి రాలేదు. ఏది ఏమైనా బీఆర్ఎస్ అధికారం కోల్పోయి వంద రోజులు కూడా కాకముందే గడ్డు పరిస్థితులు ఎదుర్కొంటుంది.

కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఎన్నో త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను తిరిగి పొందేందుకు అదే స్ఫూర్తితో బీజేపీని ఓడించే దిశగా కార్మికులు ఐక్యం కావాలని, కార్మిక చట్టాలు పునరుద్ధరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ అన్నారు. జిల్లా కేంద్రంలో వ్యవసాయ మార్కెట్‌లో 138వ మేడే వాల్ పోస్టర్లను కార్మికులతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1886న అమెరికాలో కార్మికులు హక్కుల కోసం చేసిన పోరాటంలో భాగంగా 8 గంటల పని దినాలు కల్పించబడ్డాయని దానికి అనుగుణంగా కార్మిక చట్టాల రూపకల్పన జరిగిందన్నారు. ప్రస్తుతం బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను నాలుగు కోడ్లుగా విభజించి పెట్టుబడుతారులకు అనుకూలమైన విధానాలను రూపకల్పన చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. 75 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో పౌర ప్రజాస్వామ్య పాలన అంతమైందని పెట్టుబడిదారీ విధానం కొనసాగుతుందని ఆరోపించారు. పెన్షన్ చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. హమాలి, ఆటో, ట్రాన్స్‌పోర్ట్ కార్మికులకు సమగ్ర సంక్షేమ చట్టాన్ని తేవాలని, భవన నిర్మాణ కార్మికుల మరణానికి రూ.10 లక్షల చెల్లించాలని, రూ. ఐదు వేల పెన్షన్ ఇవ్వాలని, సింగరేణి కాంటాక్ట్ కార్మికులను ఆర్టీసీలో పనిచేస్తున్న ప్రయివేట్ హైర్ బస్ డ్రైవర్లను పర్మనెంట్ చేయాలని, సింగరేణిలో గుర్తింపు పత్రం ఇవ్వాలని, ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ ఉద్యోగుల సీసీఎస్ డబ్బులను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వీటితో పాటు అంగన్‌వాడీ, ఆశ, మధ్యాహ్నం భోజనం కార్మికుల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు టి.దివాకర్, జిల్లా ఉపాధ్యక్షులు పిడుగు శంకర్, నాయకులు శ్రీనివాస్, ప్రకాష్, మోహన్, కొమురక్క పాల్గొన్నారు.

న్యూటెక్ గని ఫిట్ కార్యదర్శిగా పెరుక సదానందం

నవతెలంగాణ-నస్పూర్



సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆర్కే న్యూ టేక్ గాని ఫిట్ కార్యదర్శిగా పెరుక సదానందం ఎన్నికయ్యారు. శ్రీరాంపూర్‌లోని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ)కార్యాలయంలో ఆర్కే న్యూటెక్ ఫిట్ కమిటీని మంగళవారం ఎన్నుకున్నారు. అసిస్టెంట్ కార్యదర్శిగా అరిగే సందీప్ కుమార్, ఆర్గనైజర్ ముచ్చుకుర్తి రమేష్, సి రిలే ఎం రవికుమార్, బి రిలే ఆర్గనైజర్ అంకం రాజేష్, జనరల్ మజ్దూర్ బోడ రాంజీ, డి రిలే రాజగోపాల్, జనరల్ షిఫ్ట్ సపోర్ట్ మెన్ చీకటి జనార్ధన్, ఎలక్ట్రికల్ రహీమ్ ఖాన్, చీఫ్ అడ్వైజర్ ఆసంపల్లి అశోక్, అడ్వైజర్ సంఘం రాజయ్య అజయ్, సభ్యులు జే ప్రవీణ్ కుమార్, ఇజగిరి ప్రకాష్, అనిల్, అభిలాష్, పుల్లారావు, సతీష్, వెన్నెల దేవి తిరుపతి, అంకం లింగమూర్తులను ఎన్నుకున్నారు.

విద్యుత్ షాక్‌తో రైతు మృతి

నవతెలంగాణ-జైపూర్



భీమారం మండలం పోలంపల్లి గ్రామ పంచాయతీ తాళ్లగూడెం శివారులో మంగళవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో అనపర్తి తిరుపతి(40) మృతి చెందినట్లు స్థానిక ఎస్సై రాములు తెలిపారు. భార్య లక్ష్మితో కలిసి పొలం వద్దకు పోయిన తిరుపతి విద్యుత్ సరఫరా నిలిచిపోవడం గుర్తించి సమీపంలో గల ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు పోయాడు. ట్రాన్స్‌ఫార్మర్ ఫ్యూజులు వేసి వెనుదిరిగిన తిరుపతి ప్రమాదవశాత్తు జారిపడుతూ విద్యుత్ ప్రమాదానికి గురిఅయ్యాడు. విషయం తెల్సిన ఎస్సై రాములు సంఘనా స్థలాన్ని సంధర్శించి ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతుని భార్య లక్ష్మి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు.

ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకోవాలని వినతి

నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని లింగాపూర్ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్ అనిలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మంగళవారం పాఠశాలలోని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ బదావత్ సంతోష్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు మాట్లాడుతూ ప్రిన్సిపల్ అనిలా తీరు బాగాలేదని పలుమార్లు ఫిర్యాదు చేసిన విద్యాశాఖ అధికారులు పట్టించుకోవడంలేదని వాళ ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం యూనిఫాంలో కొరకు విద్యార్థులు నుంచి డబ్బులు వసూలు చేసి అడిగితే ముఖం చాటేస్తున్నారని ఈ విషయమై గతంలో ఫిర్యాదు చేసిన డబ్బులు తిరిగి ఇచ్చేస్తామని చెప్పి ఇంతవరకు ఇవ్వలేదని ఆయన ప్రభుత్వ పాఠశాలలో పేద విద్యార్థుల నుంచి డబ్బులు వసూలు చేసి తమ సొంతానికి వాడుకున్న ప్రిన్సిపల్ పై చర్యలు ఎందుకు తీసుకోరు అని వారు ప్రశ్నించారు. విద్యార్థులు డబ్బులు తిరిగి చెల్లించాలని కోరితే పాఠశాలకు హాజరు కాకుండా సెలవుల్లో వెళ్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల అభివద్ధి పై శ్రద్ధ లేకుండా విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు. జిల్లాలోనే మొదట ప్రారంభమైన ఆదర్శ పాఠశాలలో నేటికీ హాస్టల్ వసతి అందుబాటులోకి తీసుకురాలేదని దీంట్లో పూర్తిగా ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం ఉందని వారు అన్నారు. ఏదో ఒక కార్యక్రమం పేరు చెప్పి విద్యార్థుల నుండి డబ్బులు వసూలు చేయడం తన స్వంతానికి వాడుకోవడం పరిపాటిగా మారిందని అన్నారు. పాఠశాలలో కనీసం తాగునీటి వసతి కూడా లేదని పాఠశాలలో వసతుల కల్పనకు ఎప్పుడు కూడా ప్రిన్సిపల్ కృషి చేయలేదని ఈ విషయమై పలుమార్లు ఫిర్యాదులు చేసిన అధికారులు పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్ పై చర్యలు తీసుకొని విద్యార్థుల నుండి వసూలు చేసిన డబ్బులు వెంటనే తిరిగి చెల్లించేలా చూడాలని వారు డిమాండ్ చేశారు. లేకుంటే తమ విద్యార్థులందరినీ మూకుమ్మడిగా టీసిలు తీసుకొని వెళ్ళిపోతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం



నవతెలంగాణ-మందమర్రి

మందమర్రి కాంగ్రెస్ కార్యకర్తల సమావేశాన్ని మంగళవారం బొక్కలగుట్ట గాంధారి మైసమ్మ ప్రాంతంలో నిర్వహించారు. కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు నోముల ఉపేందర్‌గౌడ్, సీనియర్ నాయకులు సుదర్శన్, మండల అధ్యక్షుడు నీలయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌లు మాట్లాడుతూ గడ్డం వంశీకృష్ణ పెద్దపెల్లి ఎంపీగా పోటీ చేయడం సంతోషంగా ఉందన్నారు. వెంకటస్వామి కుటుంబం పేద ప్రజల కోసం కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేసే కుటుంబమని, చెన్నూరు నియోజవర్గ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి గెలిచినప్పటి నుండి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. వంశీ కృష్ణని ఎంపీగా గెలిపిస్తే పెద్దపల్లిలోని ఏడు నియోజకవర్గాలు అభివృద్ధి పథంలో ముందుంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గందే రామచందర్, ఉపాధ్యక్షులు పుల్లూరి లక్ష్మణ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు నెరువట్ల శ్రీనివాస్, డీసీసీ సభ్యుడు బత్తుల రమేష్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గడ్డం రజిని, మండల నాయకులు కదారి జీవన్ కుమార్, మైనార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ జమీల్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఎండీ ఆఫీస్, బీసీ సెల్ పట్టణ అధ్యక్షుడు మాంత్ రవి పాల్గొన్నారు.

వరి పంట దిగుబడిలో సమస్యలు

నవతెలంగాణ-జన్నారం

యాసంగి వరి సాగులో నీటి ఎద్దడి, ఎండల కారణంగా, పంట దిగుబడిలో సమస్యలు తలెత్తుతున్నాయని, మంచిర్యాల జిల్లా ఉష్ణ గణాంక అధికారి ఏఆర్‌సీ మూర్తి అన్నారు. ప్రతి సంవత్సరం యాసంగి వరి పంటలో సాగుచేసిన వరి పంట సాగు దిగుబడి అంచనాలకై, మంగళవారం మండలంలోని కొత్తపేట గ్రామంలో రైతు సత్తన్న వరి పొలంలో ప్రయోగాన్ని చేశారు. వరి పొలంలో ఐదు మీటర్ల పొడవు ఐదు మీటర్ల వెడల్పుతో, వరి పంటను కోసి ధాన్యాన్ని సేకరించగా 13.65 కిలో గ్రాముల వరి ధాన్యం, వచ్చిందన్నారు. దీని ప్రకారం చూస్తే ఎకరాకు 16 నుంచి 18 క్వింటాళ్ల వరి ధాన్యం మాత్రమే దిగుబడి వస్తుందని అంచనా వేశారు. వేసవిలో ఎండల తీవ్రత నీటి ఎద్దడి, తో దిగుబడి సమస్య తలెత్తిందన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల సలహాలు సూచనలు పాటించి, రైతులు మంచి దిగుబడి సాధించాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉష్ణ ఘనంకాల అధికారి ఏ శివకుమార్ తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డితో పాటు, రెవెన్యూ వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు..

నిర్ణీత సమయానికి పనులు పూర్తి చేయాలి

● భీమారం ఎంపీడీఓ రాధారాథోడ్



నవతెలంగాణ-జైపూర్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులు జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని స్థానిక ఎంపీడీఓ రాధా రాథోడ్ సూచించారు. మండల పరిధిలో గుర్తించిన అమ్మ ఆదర్శ పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో మంగళవారం సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సంధర్భంగా పాఠశాలల్లో అత్యవసర మరమ్మత్తులు, నిర్వాహణ, మౌళిక సదుపాయాలు, మహిళా సంఘాల కమిటీల ఏర్పాటు విషయమై అవగాహణ కల్పించారు. నిధులు కెటాయించిన పాఠశాలల్లో నిర్ణీత సమయంలో పనుల నిర్వాహణ పూర్తి చేయాలని సూచించారు.

ప్రతి అంశంపై ప్రావీణ్యం ఉండాలి

● మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వ ఉద్యోగాల సాధనలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న నిరుద్యోగ అభ్యర్థులు ప్రతి అంశాన్ని చదివి ప్రావిణ్యం సాధించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు ఎకేఎస్, ఐఏఎస్ అకాడమీ-హైదరాబాద్ ద్వారా అవగాహన, నమూనా, మాదిరి పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సదస్సుకు అదనపు కలెక్టర్, జిల్లా గ్రంథాలయ సంస్థ పర్సన్ ఇన్‌చార్జి బి.రాహుల్, తెలుగు విశ్వవిద్యాలయం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.శ్రీనివాసన్, అకాడమీ ప్రతినిధి హర్షతో కలిసి



హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహించనున్న వివిధ గ్రూపుల పరీక్షలు, డీఎస్సీ, ఇతర ఉద్యోగాల పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులు ఏకాగ్రత, పట్టుదలతో చదవాలని, సివిల్ సర్వీసెస్ పరీక్షల విధి విధానాలు, చదవడంలో అవలంభించే మెళకువలను పాటిస్తూ సిద్ధం కావాలని, ఇందుకు అభ్యర్థులకు అవసరమైన అన్ని మౌళిక సదుపాయాలు జిల్లా యంత్రాంగం తరుపున కల్పించే విధంగా కృషి చేస్తామని తెలిపారు. ఈ క్రమంలో ఎకేఎస్, ఐఏఎస్ అకాడమీ-హైదరాబాద్ ద్వారా అందిస్తున్న ఉచిత సేవను సద్వినియోగం చేసుకోవాలని, నమూనా ,మాదిరి పరీక్షలకు హాజరై పరీక్షా విధానాన్ని తెలుసుకొని ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎవీఎన్ రాజు, గ్రంథ పాలకులు ఎస్.మురళి, సిబ్బంది కృతిన్, సంపత్, చక్రవర్తి పాల్గొన్నారు.

ప్రయివేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-నస్పూర్



విద్యా సంవత్సరం పూర్తి కాకముందే ముందస్తు అడ్మిషన్లు చేస్తున్న ప్రయివేటు విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రజినికాంత్, రాష్ట్ర కమిటీ సభ్యుడు మిట్టపల్లి తిరుపతి డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దాగం శ్రీకాంత్, ఈదునూరి అభినవ్ అధ్యక్షతన మంచిర్యాల జిల్లా కేంద్రంలో చార్వాక హాల్‌లో మంగళవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతనంగా ప్రయివేటు, కార్పొరేటు, విద్యాసంస్థలు విచ్చలవిడిగా అడ్మిషన్లు చేస్తూ, పదవ తరగతి పరీక్షల ఫలితాలు రాకముందే ఇంటర్మీడియట్ అడ్మిషన్లు మొదలుపెట్టడం జరిగిందని, అధికారులు తక్షణమే ఆ కళాశాలపైన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్నటువంటి ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, కాస్మోటిక్ మెస్ చార్జీలు వెంటనే విడుదల చేయాలని, గురుకులాలు కస్తూర్బా గాంధీ పాఠశాలలో డైట్ బిల్లులను విడుదల చేయాలని, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన భవనాలు నిర్మించాలని కోరారు. జిల్లాలో ప్రయివేట్, కార్పొరేటు నూతనంగా పాఠశాల పర్మిషన్ ఇవ్వద్దు అని డిమాండ్ చేశారు. అలాగే శ్రీ చైతన్య పాఠశాలలో పర్మిషన్ లేకుండా నడిపిస్తే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు నాగరాజు, సత్యనారాయణ, రవి పాల్గొన్నారు.

పాఠశాల వసతుల కల్పనకు తమ వంతు కృషి చేస్తాం

● అటవీ అభివృద్ధి సంస్థ డివిజనల్ మేనేజర్ శ్రావణి



నవతెలంగాణ-జైపూర్

విద్యార్థుల అవసరాల మేరకు పాఠశాల వసతుల కల్పనకు తమ వంతుగా కృషి చేస్తామని అటవీ అభివృద్ధి సంస్థ కాగజ్‌నగర్ డివిజనల్ మేనేజర్ శ్రావణి తెలిపారు. మంచిర్యాల, బెల్లంపల్లి రేజ్ ప్లాంటేషన్ మేనేజర్లతో కలిసి మంగళవారం కుందారం గ్రామంలో గల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు ఉచితంగా ప్లేట్లు పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ మౌళిక వసతుల కల్పనలో భాగంగా తన తల్లి వెంకట నర్సమ్మ కోరిక మేరకు స్వంత ఖర్చులతో విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేసినట్లు తెలిపారు. అటవీ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాఠశాలల్లో ఫ్యాన్లు, టేబుళ్ల, బీరువాలు, డెస్క్ టేబుళ్ల పంపిణీ చేయడం జరిగిందని గుర్తు చేశారు. భవిష్యత్తులో కుందారం పాఠశాల అవసరాలను గుర్తించి వసతుల కల్పనకు సిద్ధంగా ఉన్నట్లు ప్రకటించారు. విద్యార్థుల హాజరు శాతం పెంచడానికి ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల నుండి మంచి ఫలితాలు సాధించడానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. అదేవిధంగా విద్యార్థులు శ్రద్ధగా చదువుకుని భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్లాంటేషన్ మేనేజర్లు సురేష్ కుమార్, సునిత, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు స్వరూప రాణి, శోభ, సుజాత, లక్ష్మన్‌రావు, లక్ష్మన్, బీ శ్రీనివాస్, సీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

చేప పిల్లల పంపిణీకి నగదు జమ చేయాలి

నవతెలంగాణ-నస్పూర్



రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లల పంపిణీ కోసం రూ.100 కోట్లు కేటాయించి ఖర్చు చేయాలని, టెండర్ల ద్వారా బ్రోకర్ల నుంచి పంపిణీ కాకుండా నేరుగా మత్స్య సొసైటీ ఖాతాల్లో నగదు జమ చేయాలని తెలంగాణ మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం తెలంగాణ మత్స్యకారులు మత్స్య కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోడెంకి చందు ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని నీలకంటేశ్వరరావు హాస్పిటల్‌లో సంఘం (టీఎంకెఎంకెఎస్) ముఖ్యబాధ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు అవుతున్న చేప పరిశ్రమ అభివృద్ధి మత్స్యకారుల సంక్షేమం పట్ల ఎలాంటి చిత్తశుద్ధి తో సంక్షేమ పథకాలను ప్రకటించడం లేదని, కనీసం మత్స్యశాఖకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను కూడా ఏర్పాటు చేయకపోవడం ఉన్న మత్స్యశాఖ కమిషనర్ పోస్టు రెగ్యులర్ కమిషనర్ కాకుండా అదనపు కమిషనర్‌ను కేటాయించడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే మత్స్య శాఖకు మంత్రిని, రెగ్యులర్ కమిషనర్ (ఐఎఎస్) క్యాడర్ అధికారిని కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర జనాభాలో 12 శాతం ఉన్న మత్స్యకారుల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళిక బద్ధంగా కృషి చేయాలని, బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, ఏడాది తీవ్ర కరువుతో ఇబ్బందుల్లో ఉన్న మత్స్య పరిశ్రమను ఆదుకోవడానికి చెరువులు, కుంటలు లీజులు రద్దు చేయాలని అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో 10 ఎకరాల స్థలం కేటాయించి రూ.50 కోట్లతో హోల్సేల్ చాపల మార్కెట్ నిర్మించాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో మత్స్యకారుల సంఘం జిల్లా నాయకులు గుమ్ముల శ్రీనివాస్, జూనగరి నారాయణ, గుమ్ముల ఆశన్న, బోడెంకి మహేష్, సందిరి వెంకటేశ్వర్లు, బోడెంకి కుమార్ పాల్గొన్నారు.

కబ్జాకు గురైన రెవెన్యూ భూమిని స్వాధీనం చేసుకోవాలి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని మురిమడుగు గ్రామంలో సర్వే నెంబర్ 64లో గల భూమిని ఆనుకొని ఉన్న రెవెన్యూ భూమిని అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తి కబ్జా చేసి అమ్ముకుంటున్నాడని, అట్టి భూమిని కాపాడాలని మురిమడుగు గ్రామానికి చెందిన పడిగెల కొమురయ్య కోరారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ భూమిపై గతంలో అటవీ శాఖ దృష్టికి తీసుకెళ్లగా, అది రెవెన్యూ భూమి అని దానికి సంబంధించిన అధికారాలు వారికే ఉంటాయని తెలిపారు. కాబట్టి అట్టి భూమిని రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకుని పట్టా భూమి అయిన నా భూమి పక్కన కాలువ దారి సౌకర్యం కల్పించాలని కోరారు. రెవెన్యూ భూమిని కబ్జా చేసిన ఆయనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు

● ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాల కల్పన లక్ష్యంగా అమ్మ ఆదర్శ కమిటీలు పనిచేయాలని ఎంపీడీఓ జేఆర్ ప్రసాద్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అమ్మ ఆదర్శ కమిటీలతో పాటు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయులుతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి రవీందర్‌తో కలిసి మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, ఇతర మరమ్మత్తుల కోసం చేపట్టే పనులు అమ్మ ఆదర్శ కమిటీ ఆధ్వర్యంలో నెల లోపు పూర్తయ్యేలా చూడాలని వారు సూచించారు. పాఠశాల అభివృద్ధి పనులకు అయ్యే నిధులు ఇదివరకే 25 శాతం విడుదలయ్యాయని మిగతా నిధులు కూడా త్వరలోనే విడుదల అవుతాయని పనుల్లో జాప్యం లేకుండా త్వరగా పూర్తి చేయాలని అన్నారు. పాఠశాలలు పునః ప్రారంభం అయ్యే లోపల పనులన్నీ పూర్తి చేయాలని సూచించారు. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ఎప్పటికప్పుడు పనుల పర్యవేక్షణ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బ్రహ్మయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అమ్మ ఆదర్శ కమిటీ సభ్యులు విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య సాధనకు విద్యార్థులు శ్రమించాలి



నవతెలంగాణ-మందమర్రి

విద్యార్థులు లక్ష్య సాధన కోసం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగాలని జబర్దస్త్ మిమిక్రీ వెంకటేష్ అన్నారు. మంగళవారం పట్టణంలోని సాయి మిత్ర గార్డెన్‌లో వివేకవర్ధిని డిగ్రీ పీజీ కళాశాల మంచిర్యాల విద్యార్థుల వీడ్కోలు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ ఆర్ శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జబర్దస్త్ మిమిక్రీ వెంకటేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్య సాధనకు శ్రమించాలని, చదువుతోపాటు అన్ని రంగాల్లో కూడా రాణించాలని సూచించారు. రాజకీయ ప్రముఖుల సినీ కళాకారులు గొంతులను అనుకరించి చేసిన హాస్యవల్లరి అందరిని ఆకట్టుకుంది. అనంతరం కళాశాల కరస్పాండెంట్ ఉదారి చంద్రమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు జాతీయ స్థాయిలో రాణించే విధంగా ఉన్నత ప్రమాణాలతో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని తెలిపారు. విద్యార్థిని విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కళాశాల యాజమాన్యం వెంకటేష్‌కి మెమంటోని వెంకీ చిత్ర పటాన్ని అందచేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు, క్రీడలలో గెలుపొందిన విజేతలకు పతకాలు జ్ఞాపికలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు షరీనా, తిరుపతి, చారి, చిరంజీవి, తాజ్, శ్రీలేఖ, విశ్వజ, శ్రీనివాస్, రాజేష్, సమీర్, భారత్ పాల్గొన్నారు.

ఎండకు ముందే పనులు ముగించుకోవాలి

● డీఆర్‌డీఓ కిషన్



నవతెలంగాణ-జైపూర్

గ్రామీణ ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న వారు ఎండలను దృష్టిలో పెట్టుకుని ఎండకు ముందే పనులు ముగించుకోవాలని డీఆర్‌డీఓ కిషన్ సూచించారు. మంగళవారం భీమారం మండలం నర్సింగాపూర్, ఖాజీపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఖాజీపల్లి, నర్సింగాపూర్, భీమారం గ్రామ శివారుల్లో కొనసాగుతున్న ఈజీఎస్ పనులను పరిశీలించారు. నిర్ణీత కొలతలతో పనులు చేపట్టాలని తెలుపుతూ రూ.300 ఈజీఎస్ కూలీ రేటుపై అవగాహణ కల్పించారు. భీమారం శివారులో చేపట్టిన పర్కులేషన్ ట్యాంక్‌ల నిర్మాణం, నర్సింగాపూర్, ఖాజీపల్లి శివారుల్లో కొనసాగుతున్న ట్రెంచ్ పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. భీమారంలో నర్సరీని సంధర్శించిన ఆయన 90 శాతం మొక్కల ఎదుగుదలను అభినందించారు. రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కు కలిగివున్న ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఈజీఎస్ సిబ్బందితో సమావేశమైన ఆయన పనుల నిర్వాహణ, రోజు వారి కూలీల సంఖ్య పెంపు తదితర విషయాలను అడిగి తెల్సుకున్నారు. పని ప్రదేశాలలో నీడలు లేనప్పుడు నీడుల ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు డీఆర్‌డీఓ దత్తారాం, ఎంపీడీఓ రాధ రాథోడ్, ఈజీఎస్ ఏపీఓ జీనత్ పాల్గొన్నారు.

18న సర్వసభ్య సమావేశం

నవతెలంగాణ-కాసిపేట

ఎంపీడీఓ కార్యాలయంలో ఈ నెల 18వ తేది గురువారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్ తెలిపారు. సమావేశానికి సభ్యులు, సంబంధిత అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

ఫర్టిలైజర్ దుకాణాలు తనిఖీ

నవతెలంగాణ-వాంకిడి



మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి ఆర్ శ్రీనివాస్‌రావు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీలర్లందరు నిబంధనలు పాటించాలని, రైతులకు తప్పనిసరిగా బిల్లుతో పాటు ఎంఆర్‌పీ ధరకు అమ్మాలని, అధిక ధరలకు అమ్మితే డీలర్‌పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయా దుకాణాల్లో రికార్డులు, స్టాకు రిజిష్టర్లను తప్పని సరిగా నమోదు చేయాలని సూచించారు. రైతులు ఆయా దుకాణాల నుండి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలన్నారు. రైతులు ఎక్కడ కొనుగోలు చేసిన దుకాణాల నుండి తప్పని సరిగా రసీదు తీసుకోవాలని రైతులను కోరారు. అధిక ధరలకు అమ్మితే తమకు ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మిలింద్ కుమార్ ఉన్నారు.

వాగులో మునిగి మత్స్యకారుడి మృతి

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మండలంలోని గుండిగూడా వాగులో చేపలు పట్టడానికి వెళ్లి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. పట్టణ సీఐ సతీష్ తెలిపిన వివరాల ప్రకారం...జిల్లా కేంద్రంలోని బెస్తవాడకు చెందిన నగోసె శంకర్ (27) మంగళవారం ఉదయం తన అన్న కొడుకు దశరథతో గుండిగూడా వాగులోకి చేపలు పట్టడానికి వెళ్ళాడు. చేపలు పట్టే సమయంలో ప్రమాదవశాత్తు వాగులో పడిపోయాడు. దశరథ్ వాగు పరిసరా ప్రాంతాల్లో వెతికగా అతని ఆచూకీ లభించలేదని, వెంటనే గ్రామస్తులకు తెలియజేశారు. గ్రామస్తులు అతనినీ వెతికి ఒడ్డుకు చేర్చే సరికి చనిపోయడని తెలిపారు. మృతుడి భార్య సురేఖ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఆయన పేర్కొన్నారు.

ప్రశాంత ఎన్నికలకు పార్టీలు సహకరించాలి

- ఆసిఫాబాద్ ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మంగళవారం గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న లోక్‌సభ ఎన్నికలు ఎలాంటి అవాంతరాలు, ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా నిర్వహించేలా రాజకీయ పార్టీలు తమ సహకారం అందించాలన్నారు. ఈనెల 18న ఎన్నికల గెజిట్ విడుదలై, నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, మే 13న పోలింగ్, జూన్ 4న కౌంటింగ్ ఉంటుందన్నారు. జూన్ 6 వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని తెలిపారు. రాజకీయ పార్టీలు, ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తన నియమావళిని పాటించాలని,



పాల్గొన్న అధికారులు, రాజకీయ పార్టీల నాయకులు



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

ఉల్లంఘనలకు పాల్పడితే భారత ఎన్నికల సంఘం నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు పోలింగ్ కేంద్రాలకు తమ పార్టీ తరపున ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్ ఏజెంట్ల వివరాలను అందించాలని సూచించారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో కోడ్ వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు జిల్లాలో 1004 లీటర్ల మద్యాన్ని స్వాధనం చేసుకున్నామని, దాని విలువ రూ.4,96,989 ఉంటుందని, రూ.1,34,86,860 నగద, 17 ఎల్జి మిక్సర్లు, 43 కూలర్లు వాటి విలువ రూ.1,75,283, 1.15 కేజీల గల గంజాయిని సీజ్ చేయడం జరిగిందని వివరించారు. 360 మందిని ఇప్పటికే బైండోవర్ చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) దాసరి వేణు, జిల్లా రెవెన్యూ అధికారి లోకేశ్వర్ రావు, డీఎస్పీ సదయ్య, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా కళాశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డి.లక్ష్మినరసింహం మాట్లాడుతూ డిగ్రీ విద్యను పూర్తి చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాబోయే విద్యాసంవత్సరంలో కళాశాలలో నూతన కోర్సులకు ఉన్నత విద్యామండలికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అనంతరం వివిధ యూనివర్శిటీలలో పీజీలో ప్రవేశాలు సాధించిన డిగ్రీ కళాశాల విద్యార్థులను సన్మానించారు. వార్షికోత్సవం సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వివిధ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ రాజు, అధ్యాపకులు ఎస్ వెంకటేశ్వర్లు, శారద, దత్తాత్రేయ, దేవేందర్, జనార్ధన్, వెంకటేశం, కృష్ణవేణి, టేమాజి పాల్గొన్నారు.

గైడ్ ఓలంపియాడ్ పరీక్షలో విద్యార్థుల ప్రతిభ



నవతెలంగాణ-రెబ్బెన

గైడ్ ఓలంపియాడ్ పరీక్షలో రెబ్బెన సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల(బాలికలు), కళాశాల(బాలికలు) విద్యార్థినిలు రాష్ట్ర, జిల్లాస్థాయిలో మంచి ప్రతిభ కనబరిచారని సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. గత నెలలో నిర్వహించిన ఈ పరీక్షలో తొమ్మిదో తరగతి చదువుతున్న దొంతుల హర్షిత సామాన్య శాస్త్ర విభాగంలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో 11వ ర్యాంకు సాధించిందని, ఏడో తరగతి చదువుతున్న వైరాగడె శైలజ సామాన్య శాస్త్ర విభాగంలో జిల్లా స్థాయిలో మొదటి ర్యాంకు సాధించిందని తెలిపారు. ఆరో తరగతి చదువుతున్న డోంగ్ర అలేఖ్య ఇంగ్లీష్ సబ్జెక్టులో రెండో ర్యాంకు సాధించిందని, ఆరో తరగతి చదువుతున్న నోగులపల్లి నైనిక గణితంలో జిల్లాస్థాయిలో నాల్గవ ర్యాంకు సాధించిందన్నారు. పరీక్షలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఆర్‌సీఓ, డీసీఓ చేతుల మీదుగా మోడల్స్ సర్టిఫికేట్స్, మెమోంటోలు అందించడం జరిగిందన్నారు. గైడ్ ఓలంపియాడ్ పరీక్షలో ప్రతిభ కనబరిచిన విద్యార్థినిలను అభినందించి ఆయా సబ్జెక్టు టీచర్లను అధికారులు అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ చైతన్యతో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

'రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ఖండిస్తున్నాం'




నవతెలంగాణ-నిర్మల్

నారాయణపేట సభలో సీఎం రేవంత్‌రెడ్డి ఎమ్మార్పీఎస్ ఉద్యమం పట్ల, మంద కృష్ణ మాదిగ గురించి, అహంకారంతో కుట్ర బుద్ధితో మాట్లాడుతూ మాదిగలను అవమానిస్తూ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని ఎమ్మార్పీఎస్ జిల్లా కోఆర్డినేటర్ శనిగారపు రవి అన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీఓ భవనంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. రాష్ట్రంలో పార్లమెంటుతో పాటు ఒక కంటోన్మెంట్లో ఉప ఎన్నికలు జరుగుతున్న సందర్భంగా రాష్ట్రంలో 80 లక్షల మంది మాదిగలకు ఒక్క సీటు అవకాశం ఇవ్వకుండా పైగా మాదిగలకు ఏదో ఒరగపెట్టినట్లు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మాదిగల ఆవేదన పట్టించుకోకుండా సామాజిక న్యాయాన్ని విస్మరించి రిజర్వేషన్ అవకాశాలను తుంగలో తొక్కి, అధిక జనాభా ధమాషా కలిగిన మాదిగలను అణిచివేస్తు, ఒకే సామాజిక వర్గానికి రేవంత్‌రెడ్డి తన కుర్చీని కాపాడుకునేందుకు ఎస్సీలో ఒకే సామాజిక వర్గానికి వత్తాసు పలుకుతున్నారని అన్నారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్ నియోజవర్గ ఇన్‌చార్జి కొలగని రాజు, తొండకూరి సాయన్న నామత్కర్ లక్ష్మణ్ పాల్గొన్నారు.

కాలనీవాసులకు ఇండ్ల పట్టాలివ్వాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్



కుమురంభీం కాలనీవాసులకు ఇండ్ల పట్టాలివ్వాలని తుడుందెబ్బ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే పాయల శంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రసిడెంట్ గోడం గణేష్ మాట్లాడారు. కుమురంభీం కాలనీలో నివసిస్తున్న ఆదివాసులకు పట్టాలు ఇవ్వాలని, తక్షణ మౌలిక సదుపాయాలు అయినటువంటి కరెంటు, తాగునీరు, విద్య, వైద్య సౌకర్యాలు కల్పించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జిల్లా ప్రచార కార్యదర్శి వెట్టి మనోజ్, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు గోడం రేణుక, జిల్లా కార్యదర్శి సోయం లలిత, డివిజన్ కమిటీ ఉపాధ్యక్షులు ఆత్రం గణపతి, మహిళా సంఘం మావల అధ్యక్షురాలు కుమ్ర శాంతాబాయి, రైతు సంఘం డివిజన్ కమిటీ అధ్యక్షుడు ఆత్రం భుజంగరావు, తొడసం ప్రకాష్, సోయం భీంరావు, పుస్నాక్ నాగోరావు ఉన్నారు.

తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని స్టేషన్ రోడ్డులో డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేసి ఉన్న రేషన్ బియ్యాన్ని మంగళవారం టౌన్ పోలీసులు పట్టుకున్నారు. ముందస్తుగా అందిన సమాచారం మేరకు డీసీఎం వ్యాన్‌లో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉన్న 18 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్థానిక తైబనగర్‌కు చెందిన కుక్క రాజేష్, రాజక్ రెహమాన్‌లు ఈ బియ్యాన్ని మహారాష్ట్రకు తరలించి సొమ్ము చేసుకుంటున్నట్లు పోలీసుల విచారణలో తేలగా వారిపై కేసులు నమోదు చేసినట్లు టౌన్ సీఐ శంకరయ్య తెలిపారు. ఈ బియ్యాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. కాగా గతంలో కూడా ఇదే స్థలంలో రేషన్ బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పెద్ద మొత్తంలో స్వాధీనం చేసుకున్నారు.

ఆటోలో తరలిస్తున్న ఇద్దరిపై...

ఇదే ప్రాంతం నుండి ఆటోలో రేషన్ బియ్యం తరలిస్తున్న ఇద్దరిపై పోలీసులు కేసు నమోదు చేశారు. స్థానిక తైబనగర్‌లోని పోస్టాఫీసు పక్కన నాలుగు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని ఆటోలో లోడ్ చేసి మహారాష్ట్రకు తరలించేందుకు సిద్ధంగా ఉండగా పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసులో తైబనగర్‌కు చెందిన అఫ్రోజ్‌పాషా, అంకుష్‌బీలపై కేసు నమోదు చేసినట్లు సీఐ శంకరయ్య వివరించారు.

20 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

కాగజ్‌నగర్ రూరల్ : రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఈస్‌గాం సబ్ స్టేషన్ సమీపంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. చింతగూడకు చెందిన సయ్యద్ ఖాజా బొలెరో వాహనం(టీఎస్ 01-యూబీ-0672)ని తనిఖీ చేయగా 20 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం లభ్యమయ్యాయి. సయ్యద్ ఖాజాను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు రూరల్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు. ఈ టాస్కులో కాగజనగర్ ఏఎస్సై హీరామన్, హెడ్ కానిస్టేబుల్ శంకర్ పాల్గొన్నారు.



కాగజ్‌నగర్ : బియ్యం లోడ్ చేసి ఉన్న వ్యాన్‌తో పోలీసులు

నేరస్తులకు శిక్షలు పడేవిధంగా పరిశోధన నిర్వహించాలి

- ఎస్పీ గౌస్ ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నేరస్తులకు కచ్చితంగా శిక్షలు పడే విధంగా పరిశోధన నిర్వర్తించాలని జిల్లా ఎస్పీ గౌస్ ఆలం తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మాదక ద్రవ్యాల నిరోధక చట్టంతో పరిశోధనలు చేయు విధానం కోర్టులో చార్జిషీటు దాఖలు చేయు విధానం, నేరస్తులను పట్టుకునే క్రమంలో చేయు పద్ధతులపై మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకునేటప్పుడు తీసుకోవాల్సిన పద్ధతులు, అంశాలపై ఇన్వెస్టిగేషన్ అధికారులకు శిక్షణ కార్యక్రమంతో అవగాహనను కల్పించారు. జిల్లాలో ఎటువంటి మత్తు పదార్థాలు లేకుండా సమిష్టిగా కృషి చేసి నేరస్తులకు శిక్షలు పడే విధంగా పరిశోధన నిర్వర్తించాలని సూచించారు. అదేవిధంగా ప్రజలు మత్తు పదార్థాలను తాగడం వల్ల నేరాలు చేయుటకు ఆస్కారం ఉన్నందున ప్రజలకు అవగాహన కార్యక్రమాలను ఏర్పాటు చేసి, మత్తు పదార్థాల వల్ల జరిగే అనర్థాలపై వివరించాలని సూచించారు. గంజాయి కల్తీకల్లు తదితర మత్తు పదార్థాలను తాగడం వల్ల జీవితాలు నాశనమవుతాయని విషయాన్ని ప్రజలకు వివరించాలని సూచించారు. అదేవిధంగా పదేపదే నేరం చేసే నేరస్తులపై ప్రత్యేక కార్యచరణ ద్వారా శిక్షలు కఠినంగా విధించే విధంగా చార్జిషీట్ దాఖలు చేయాలని సూచించారు. టీఎస్ న్యాబ్ ద్వారా విచ్చేసిన నూతన పోస్టర్లను జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అందుబాటులో ఉంచి చైతన్య పరచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీసీఆర్బీ డీఎస్పీ కే.సురేందర్‌రెడ్డి, డీసీఆర్బీ ఇన్స్‌పెక్టర్ ప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.

సివిల్స్‌లో ప్రతిభ చాటిన ఉమ్మడి జిల్లా యువకులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

యూపీఎస్సీ నిర్వహించిన సివిల్ సర్వీసెస్‌లో జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన పూర్వ విద్యార్థి రేకుల్‌వార్ శుభమ్ అద్భుత ప్రతిభ కనబర్చి ర్యాంక్ సాధించాడు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం ముత్నూర్ గ్రామానికి చెందిన రేకుల్‌వార్ శుభమ్ కాగజ్‌నగర్‌లోని జవహర్ నవోదయ విద్యాలయంలో ఆరో తరగతి నుండి పదో తరగతి (2005-2010) వరకు విద్యను అభ్యసించాడు. గౌహతిలో సివిల్ ఇంజనీరింగ్ విభాగంలో ఐఐటీ పూర్తి చేసుకున్న శుభమ్ సివిల్ సర్వీసెస్ సాధించడానికి పట్టుదలతో కృషి చేశాడు. గత మూడు పర్యాయాలు మెయిన్స్, ప్రిలిమ్స్, ఇంటర్వ్యూ వరకు వచ్చిన శుభమ్ ఇంటర్వ్యూలో ప్రతిభ చూపలేక విఫలమయ్యాడు. ప్రస్తుతం నాలుగో ప్రయత్నంలో 790వ ర్యాంక్ సాధించి విజయం పొందాడు. సత్యనారాయణ-గీత దంపతుల కుమారుడైన శుభమ్ సివిల్ సర్వీసులో విజయం సాధించడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

నవోదయలో రెండో విద్యార్థి

జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన పూర్వ విద్యార్థులలో సివిల్ సర్వీసు సాధించిన వారిలో శుభమ్ రెండో విద్యార్థి. 2019లో ఈ విద్యాలయానికి చెందిన పూర్వ విద్యార్థి వివేకానంద శుక్లా ఐపీఎస్ సాధించాడు. ప్రస్తుతం అతను తమిళనాడులోని తిరుచ్చి జిల్లాలో ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నాడు. రెండో విద్యార్థి శుభమ్ సివిల్ సర్వీసు సాధించడం పట్ల విద్యాలయం ప్రిన్సిపల్ బి చక్రపాణి హర్షం వ్యక్తం చేశారు. మొదటి నుండి శుభమ్ క్రమశిక్షణ కలిగిన విద్యార్థి అని, పదో తరగతిలో విద్యాలయం టాపర్‌గా నిలిచినట్లు తెలిపారు. ప్రతిభావంతుడైన శుభమ్ భవిష్యత్తులో ఉన్నత స్థానంలో ఉంటాడని భావించామని, అనుకున్న విధంగానే విజయం సాధించాడని ఆయన అన్నారు.





రేకుల్‌వార్ శుభమ్, ఆరె విశాల్

718 ర్యాంకు సాధించిన ఆరె విశాల్

ఆదిలాబాద్‌రూరల్ : 2024 యూపీపీఎస్‌సీ నిర్వహించిన సివిల్ సర్వీస్ ఫలితాల్లో ఆదిలాబాద్ జిల్లా వాసి ఆరె విశాల్ 718వ ర్యాంకు సాధించారు. చాందా(టి) గ్రామానికి చెందిన ఆరె విశాల్ తన చిన్ననాటి కలను నెరవేర్చుకున్నాడు. తన తండ్రి జైపూర్‌లో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా విధులు నిర్వహిస్తున్నారు. సివిల్స్‌లో ర్యాంక్ సాధించడం పట్ల బంధుమిత్రులు, గ్రామస్తులు అభినందించారు. విశాల్‌ను ఆదర్శంగా తీసుకొని యువత చదువులో రాణించాలని అన్నారు.

శ్రీరామనవమికి ఏర్పాట్లు పూర్తి

నవతెలంగాణ-వాంకిడి

మండల కేంద్రంలోని హనుమాన్ ఆలయం వద్ద శ్రీరామనవమిని పురస్కరించుకొని అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్టు గాదె అవినాష్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం సీతారాముల కళ్యాణ మహోత్సవానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై సీతారాముల కళ్యాణాన్ని తిలకించాలన్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే మండలంలోని బంబారా, ఇందానీ తదితర గ్రామాల్లో కూడా హనుమాన్ ఆలయాల వద్ద సీతారాముల కళ్యాణ మహోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు.

కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను వెంటనే పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

కస్టమ్ మిల్లింగ్ రైస్ సరఫరాను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ మిల్లర్లు, అధికారులను ఆదేశించారు. మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రెవెన్యూ, పౌర సరఫరాల శాఖల అధికారులతో సీఎంఆర్ సరఫరా, లక్ష్యాలు తదితర అంశాలపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. సీఎంఆర్ సరఫరాను పూర్తి చేయాలని ఆదేశించారు. నిరంతరం మిల్లింగ్ ప్రక్రియ జరగాలని సూచించారు. ఇప్పటివరకు మిల్లింగ్ ప్రారంభించని మిల్లర్లపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. సంబంధిత మిల్లర్లకు నోటీసులు జారీ చేయాలనీ సూచించారు. మిల్లుల వారీగా మిల్లింగ్, ధాన్యం నిల్వలపై రిపోర్టులను అందజేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మిలర్ల వారిగా లక్ష్యం, పూర్తిచేసిన సీఎంఆర్ సరఫరా, పెండింగ్‌పై చర్చించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, డీఎస్ఓ నంధిత, డీఎం సివిల్ సప్లైయ్ శ్రీకళ, మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, మిల్లర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

టీబీజీకేయస్ సభ్యత్వ నమోదు

నవతెలంగాణ-రెబ్బెన

బెల్లంపల్లి ఏరియా ఖైరిగూడ ఓపెన్‌కాస్టులో టీబీజీకేయస్ సభ్యత్వం నమోదు కార్యక్రమం నిర్వహించారు. కార్యకర్తలకు బెల్లంపల్లి ఏరియా టీబీజీకేయస్ వైస్ ప్రెసిడెంట్ మల్రాజ్ శ్రీనివాస్‌రావు సభ్యత్వం అందజేశారు. సింగరేణి కార్మికులకు ఎన్నో హక్కులు అందించిన తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘాన్ని ఆదరించాలని, బెల్లంపల్లి ఏరియాలో ఉద్యోగులకు పని వేళల మార్పు, ఉచిత బస్సు సౌకర్యం, మినరల్ వాటర్‌ప్లాంటు ఏర్పాటు లాంటి ఎన్నో కార్యక్రమాలు సింగరేణికి అందించిన ఘనత టీబీజీకేయస్‌కే దక్కుతుందన్నారు. కోలిండియాలో లేని హక్కులు టీబీజీకేయస్ సాధించిపెట్టిందన్నారు. కారుణ్య నియామకాలు కూడా టీబీజీకేయస్ యూనియన్ వల్లనే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేయస్ ఫిట్ కార్యదర్శి కార్నాదం వెంకటేశం, ఏరియా నాయకులు మారిని వెంకటేష్, గజ్జెల్లి చంద్రశేఖర్, కమిటీ సభ్యులు ఓరం కిరణ్, మోరె సత్యనారాయణ, శ్యాంసుందర్, దాసరి బాబురావు, తుంపల బాపు, కొయ్యాడ శ్రీనివాస్, మారిని చందర్, రాజమౌళి, భిక్షపతి, రాజేశం, మల్లేష్, దుస్సు శ్రీనివాస్, తోట మధు, భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.



19న వామపక్ష పార్టీల సదస్సు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

దేశంలో పెరిగిపోతున్న మతోన్మాదం పట్ల ప్రజలను అప్రమత్తం చేసే ఉద్దేశంతో ఈ నెల 19న జిల్లా కేంద్రాల్లోని తిరుమలలో తొమ్మిది వామపక్ష పార్టీలతో నిర్వహించనున్న సదస్సును జయప్రదం చేయాలని వివిధ వామపక్ష పార్టీల కార్యదర్శులు చాంద్ పాషా, కుశన రాజన్న, బద్రి సత్యనారాయణ, గోకర్ల తిరుపతి ఉమ్మడి ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ సదస్సులో న్యూ డెమోక్రసీ, సీపీఐ(ఎం), సీపీఐ, సీపీఐ(ఎంఎల్) రెడ్ స్టార్‌తో పాటు వివిధ వామపక్ష నాయకులు హాజరుకానున్నారని కోరారు.

శోభాయాత్రలో ఇబ్బందులు కలగకుండా చూడాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

శ్రీరామనవమి సందర్భంగా శ్రీరామ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో పట్టణంలో నిర్వహిస్తున్న శోభాయాత్రలో రామ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. మంగళవారం శోభాయాత్రకు సంబంధించిన పనులను ఉత్సవ సమితి సభ్యులతో కలిసి గోపాలకృష్ణ మఠంలో పరిశీలించారు. ఈ యాత్రలో పాల్గొనడానికి వస్తున్న భక్తుల కోసం మంచినీరు, ప్రసాదం వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సూచించారు. 500 ఏండ్ల హిందువుల కల నరేంద్ర మోడీ వల్ల సహకారమైందని, శ్రీరామనవమి పండుగను హిందువులు భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాలతో జరుపుకోవాలని అన్నారు. ఇందులో శ్రీరామ ఉత్సవ సమితి నాయకులు రాళ్లబండి మహేందర్, సాయి మహేందర్ జోగు రవి, ఆకుల ప్రవీణ్, సురేందర్, అర్జున్, నాగేందర్ గౌడ్, నిఖిల్, శివ గౌడ్, గోపి, సచిన్ ఉన్నారు.

ఓపెన్‌కాస్ట్ కార్మికులకు ఇన్సెంటివ్ చెల్లించాలి

నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో పనిచేసే కార్మికులందరికీ ఇన్సెంటివ్ చెల్లించాలని గుర్తింపు కార్మిక సంఘం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ఎస్ఆర్పీ ఓసిలో ధర్నా నిర్వహించి అనంతరం ఓసీపీ మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, శ్రీరాంపూర్ బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా మాట్లాడుతూ శ్రీరాంపూర్ ఓసీలో యాజమాన్యం నిర్దేశించిన ఉత్పత్తి, రవాణాను అధిగమించడానికి కృషిచేసిన కార్మికులందరికీ ఇన్సెంటివ్ అమలయ్యేలా యాజమాన్యం కృషి చేయాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేశారు. శ్రీరాంపూర్ ఓపెన్ కాస్ట్ గనిలో ఓసీపీ, సిహెచ్‌పీ రెండు కలిసి ఒకే చోట ఉండటం ఇన్సెంటివ్ రావడంలేదని వీటిని రెండు భాగాలుగా వేరు చేయాలని అన్నారు. శ్రీరాంపూర్ ఓసి నుండి నెలకు 63 ర్యాకులు రవాణా చేయవలసి ఉంటే దాదాపు 95 నుండి 114 వరకు ర్యాకులు పంపించడం జరుగుతుందని, ఇన్సెంటివ్ ప్రోత్సాహకాన్ని కార్మికులకు చెల్లించడం ద్వారా మరింత ఉత్సాహంతో కార్మికులు పనిచేస్తారన్నారు. వెంటనే శ్రీరాంపూర్ జీఎం స్పందించి



కార్మికులకు ఇన్సెంటివ్ అమలయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ బ్రాంచ్ సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, బద్రి బుచ్చయ్య, ఫిట్ కార్యదర్శిలు మోతే లచ్చన్న, గునిగంటి నర్సింగ్ రావు, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్, దాడి రాజయ్య, నాగేశ్వరరావు, నల్లపు సత్తయ్య, నాయకులు గండి సతీష్, రాజమౌళి, మల్లెత్తుల శ్రీనివాస్, ఆకుల బాపు, శంకర్, సత్యనారాయణ, లక్ష్మణ్, నర్సింగ్, ఆడేపు సురేష్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక సిటీకేబుల్ కార్యాలయం వద్ద డా.సలీమ్ ఆధ్వర్యంలో మంగళవారం చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా సలీమ్ మాట్లాడుతూ మండుటెండలను దృష్టిలో ఉంచుకొని పట్టణ ప్రజల దాహార్తి తీర్చుటకు చలివేంద్రం ప్రారంభించామని, ప్రజలు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేత్తుల రాజేషం, బీఆర్ఎస్ యువ నాయకులు గాజుల. చంద్రకిరణ్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు జాలిగపు రాజేశ్వరి, అక్కల రామకృష్ణ పాల్గొన్నారు.

క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం

ఆదిలాబాద్‌టౌన్ : పట్టణంలోని ఇందిరమ్మ కాలానికి చెందిన సంజయ్ సట్లావర్ కొన్ని రోజులుగా క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని ఛాంబర్ అఫ్ కామర్స్ కార్యదర్శి గంద్రత్ సంతోష్ స్థానిక కాన్వెంట్ స్కూల్ యాజమాన్యానికి తెలియజేశారు. స్పందించిన ప్రిన్సిపల్ మెరియా రోజ్, మేనేజర్ లిజన్టో రూ. 25000 నగదును బాధితుడి భార్యకు మంగళవారం అందజేశారు. దీంతో వారికి బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శివప్రసాద్, వినోద్‌రెడ్డి, సుశాంత్ ఉన్నారు.

అమ్మానాన్న జ్ఞాపకార్థం బేంచీల ఏర్పాటు

నవతెలంగాణ-బోథ్

మండలంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల సమీపంలో మంగళవారం నాగభూషణం పాఠశాల ప్రదోనోపాద్యాయుడు కిషోర్ కుమార్ అమ్మానాన్న సుందరమ్మా-నాగభూషణం జ్ఞాపకార్థం రెండు బెంచీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ స్వర్ణలత, నాగభూషణం పాఠశాల ప్రిన్సిపాల్ కిషోర్ కుమార్, ఉపాధ్యాయురాలు రచన, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

మదర్ థెరిసా పాఠశాల ఎదుట నిరసన



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని కన్నెపల్లి మదర్ థెరిసా పాఠశాలలో హనుమాన్ మాల ధరించిన విద్యార్థులను పాఠశాలకు అనుమతించక పొగ అవమాన పర్చారని విద్యార్థులు తల్లిదండ్రులు, హనుమాన్ దీక్ష పరులు పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. సుమారు వెయ్యి మంది పాఠశాల ఎదుట జాతీయ రహదారిపై బైఠాయించి రాస్తరోకో నిర్వహించారు. పాఠశాల సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల తల్లిదండ్రులు హనుమాన్ దీక్ష పరులు మాట్లాడారు. పాఠశాలలో విద్యార్థులకు మత బోధ చేస్తూ హిందు విద్యార్థులపై సిబ్బంది కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తాము ఎంతో పవిత్రంగా భావించే హనుమాన్ మాల ధారణ అయిన తర్వాత వాటిని తొలగించి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేశారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే జిల్లా అధికారులు స్పందించి పాఠశాల గుర్తింపు రద్దు చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గతంలో కూడా పాఠశాల సిబ్బందిపై చాలా ఫిర్యాదులు ఉన్నాయని అయినా గాని జిల్లా విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహారిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచిర్యాల డిసిపి అశోక్ కుమార్ బాధ్యులపై చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

తాగు నీటి సమస్య గుర్తించి ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలి

● మండల ప్రత్యేకాధికారి రమేష్

నవతెలంగాణ-జైపూర్

వేసవి ఎండలు ముదురడంతో పాటు భూగర్భ నీటి మట్టం పడిపోయే అవకాశం ఉన్నందున నీటి సమస్య ఏర్పడే అవకాశం కన్పిస్తే వెంటనే ప్రత్యామ్నయ ఏర్పాట్లు చేయాలని మండల ప్రత్యేకాధికారి, పశు సంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ రమేష్ సూచించారు. మంగళవారం ఇందారం గ్రామాన్ని సంధర్శించిన ఆయన గ్రామ పంచాయతి పరిధిలో నీటి సరఫరా తీరును పరిశీలించారు. వ్యక్తిగత పైప్ లైన్‌తో పాటు మిషన్ భగీరథ పైప్‌లైన్ ద్వార నీటిని సరఫరా చేస్తున్న తీరును పర్యవేక్షించారు. గ్రామ పంచాయతీ పరిధిలో కాలనీ చివరి ఇంటి వరకు నీటి సరఫరా కొనసాగేవిధంగా చూడాలని, సమస్య ఎదురైతే వెంటనే



పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని సూచించారు. గ్రామంలో నీటి సరఫరా కొనసాగుతున్న తీరును స్థానికులను అడిగి తెల్సుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతి అధికారి అనిల్ కుమార్, పంచాయతి కార్యదర్శి సుమన్ ఉన్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలకు అవగాహన

కాసిపేట : మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో మండల స్థాయి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలపై అవగాహన సదస్సును మండల నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సంధర్భంగా నూతనంగా ఎన్నికైన అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్లకు, వీఓలకు, అన్ని పాఠశాలల హెచ్‌ఎంలకు పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా చేపట్టాల్సిన పది రకాల పనులను నోడల్ ఆఫీసర్ రాథోడ్ రమేశ్ అవగాహన కల్పించారు. వీఓల పాత్ర, హెచ్‌ఎంల పాత్రపై క్షుణ్ణంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం వెంకటేశ్వర్లు, ఎంపీఓ నాగరాజు, ఏఈ సాయి కృష్ణ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సాంబమూర్తి, సుధాకర్ నాయక్, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ అందె నాగ మల్లయ్య, హెచ్ఎం నెన్నెల లచ్చన్న, హెచ్‌ఎంలు, వీవోలు, సీసీఓ రాంబాబు, సీఆర్పీలు పాల్గొన్నారు.

మందమర్రి : ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంఈఓ పోచయ్య ఆధ్వర్యంలో అమ్మ ఆదర్శ పాటశాల కమిటీలకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక మౌలిక వసతులను బలోపేతం చేయడం, పేద విద్యార్థులకు చేయూతనందించడం, బాలికల మరుగు దొడ్ల నిర్మాణం, తాగునీటి సౌకర్యాలు కల్పించడం, తరగతి గదుల విద్యుద్దీకరణ, యూనిఫాంలు కుట్టడం గురించి వివరించారు.

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి : ఐదుగురి అరెస్ట్



నవతెలంగాణ-మందమర్రి

పేకాట స్థావరంపై టాస్క్ ఫోర్స్ పోలీసుల దాడి చేసి మంగళవారం ఐదుగురుని అరెస్ట్ చేశారు. పట్టుకున్న వారి నుంచి రూ.18,490 నగదు 5 మొబైల్స్ 4 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం సాయంత్రం మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో చతులాపూర్ గ్రామ సమీపంలో డబ్బులు పందెంగా పెట్టి పేకాట ఆడుతున్నారనే సమాచారం మేరకు మంచిర్యాల టాస్క్ ఫోర్స్ ఇన్స్‌పెక్టర్ సంజయ్ కుమార్, ఎస్ఐ లచ్చన్న తమ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేసి 5 గురు వ్యక్తులు పట్టుకుని వారి నుండి 5 మొబైల్స్, 4 ధ్విచక్ర వాహనాలు రూ.18,490 నగదు స్వాధీనం చేసుకున్నారు. మరో వ్యక్తి పరారిలో వున్నట్లు ఇన్స్‌పెక్టర్ తెలిపారు. పట్టుబడిన వారిలో కనుకుంట్ల నర్సయ్య (58), తండ్రి లక్ష్మయ్య, సింగరేణి ఉద్యోగి, మందమర్రి, సముద్రాల రమేష్(40), తండ్రి రాజయ్య, సింగరేణి ఉద్యోగి, 2వ జోన్, మందమర్రి, గంగారపు రామకష్ణ(45), తండ్రి ఎల్లయ్య, ప్రయివేటు ఉద్యోగి, 2వ జోన్ మందమర్రి, గుంజపడుగు సంపత్(44), బార్బర్ షాప్, 2వ జోన్ మందమర్రి, మామిడాల శంకర్ (63), తండ్రి రంగయ్య, రిటైడ్ సింగరేణి ఉద్యోగి, మందమర్రి. పరారిలో ఉన్న నిందితుడు లోకిని ప్రశాంత్ తండ్రి సమ్మయ్య మంచిర్యాల అని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ సంజయ్ కుమార్ తెలిపారు.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

● అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

నవతెలంగాణ-జన్నారం

రైతులు వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మంచిర్యాల అడిషనల్ కలెక్టర్ మోతిలాల్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇందన్ పల్లి దేవునిగూడా, మొర్రిగూడ , డీఆర్డీఏ ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వరి కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించారు. రైతులు దళారుల చేతుల్లో మోసపోకుండా నేరుగా ప్రభుత్వం నిర్వహించే వరి కొనుగోలు కేంద్రాల్లోనే తమ ధాన్యాన్ని విక్రయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నాణ్యమైన ధాన్యాన్ని సేకరించి వెంట వెంటనే మిల్లులకు పంపించాలన్నారు. కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ రాజా మనోహర్‌రెడ్డి, ఏఓ సంగీత, ఆర్ఐ భాను చందర్, ఏపీఎం సీహెచ్ బుచ్చన్న, ఏఈఓ అక్రముల్లా ఖాన్, కొనుగోలు కేంద్రాల ఇన్‌చార్జిలు మహేందర్, సరోజా సునీత, బుక్కు కీపర్లు రమేష్, సుధాకర్, సత్యం పాల్గొన్నారు.

ప్రాణాలను లెక్క చేయకుండా అగ్ని ప్రమాదాల నివారణకు కృషి

● ఆకట్టుకున్న అగ్నిమాపక విన్యాసాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అగ్ని ప్రమాదాల నివారణతో పాటు ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడేందుకు ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహిస్తు అండగా ఉంటున్నామని జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి కేశవులు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఎన్టీఆర్ చౌక్‌లో విన్యాసాలు చేశారు. ప్రమాదాలు జరిగిన సమయంలో ఏవిధంగా వ్యవహరించాలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అగ్రిమాపక శాఖ అధికారి కేశవులు మాట్లాడుతూ అగ్నిమాపక సిబ్బంది త్యాగాలు, విజయాలు, ధైర్య సాహసాలను తెలియజేడంలో భాగంగా వారం రోజుల వారోత్సవాలను నిర్వహిస్తున్నామని తెలిపారు. 1944లో విక్టోరియ యార్డులో జరిగిన అగ్ని ప్రమాదంలో 66 మంది అగ్నిమాపక సిబ్బంది ప్రాణాలు కొల్పోయారని తెలిపారు. వారి త్యాగాలు, అగ్నిమాపక సేవలు ప్రజలకు తెలియజేయడంలో భాగంగా ప్రతి ఏటా ఏప్రిల్ 14 నుంచి 20 వరకు వారం రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించి అగ్రిమాపక శాఖ చేస్తున్న పనులను వివరించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ ఫైర్ అధికారి శివాజీ, సిబ్బంది పాల్గొన్నారు.